www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -119 గురువారం13 ఆగస్టు 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



# మిల్లర్ల బకాయిలు వసూలు చేయాల్సిందే

### దానికోసం విధివిధానాల రూపకల్పన

### ధాన్యం నిల్వల కోసం (ఐదు నియోజకవర్గాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలు

### పౌరసరఫరాల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్ఆగష్టు 12,(ప్రజావినికిడి):**
మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో పౌరసరఫరాల శాఖపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో **మిగతా 2లో...**

## షార్ట్‌కట్ కోసం వెంపర్లాడితే నష్టపోతాం

### అర్థవంతమైన మార్గంలో సాగితేనే మంచిది

### జెన్‌జీలకు మోడీ పరోక్ష హెచ్చరికలు



**న్యూఢిల్లీఆగష్టు 12,(ప్రజావినికిడి):**
ప్రధాని నరేంద్ర మోదీ జెన్‌జీ యువతకు కీలక సూచన చేశారు. షార్ట్‌కట్ కోసం వెంపర్లాడితే నష్టపోయే ప్రమాదమే ఎక్కువని ప్రధాని హెచ్చరించారు. జీవితంలో ముందుకుసాగే క్రమంలో అర్థవంతమైన మార్గాలను ఎంచుకోవాలని హితవు పలికారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ పుస్తకం విడుదల సందర్భంగా ఆయన మాట్లాడారు. కొందరు వ్యక్తులు వేగంగా గమ్యాన్ని**మిగతా 2లో...**

## రాజ్యసభను కుదిపేసిన లుంగీవాలా వివాదం

### తనను లుంగీవాలా అని పిలిచారంటూ బీజేపీ ఎంపీపై సీపీఎం ఎంపీ ఫిర్యాదు

### ఆ వ్యాఖ్యలు తాను చేయలేదని, బ్రిట్టాస్ అబద్ధం చెబుతున్నారని సుస్మితా దేవ్ ఖండన

### ఒకరిపై మరొకరు హక్కుల ఉల్లంఘన నోటీసులు దాఖలు



**న్యూఢిల్లీ,ఆగష్టు 12,(ప్రజావినికిడి):**
రాజ్యసభలో బుధవారం 'లుంగీవాలా' వివాదం తీవ్ర దుమారం రేపింది. తనను ఉద్దేశించి బీజేపీ ఎంపీ సుస్మితా దేవ్ ఈ పదాన్ని ఉపయోగించారని కేరళకు చెందిన సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు.సోమవారం నాడు సభలో తాను ఆదాయపు పన్ను సవరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న**మిగతా 2లో...**

## రూ.2.08 లక్షల కోట్ల విలువైన 25 ప్రాజెక్టులకు ఏకగ్రీవ ఆమోదం



2లో.

## టాటా సన్స్ చైర్మన్ పదవికి గుడ్‌బై..

### చంద్రశేఖరన్ సంచలన నిర్ణయం..

### 2027 తర్వాత కొనసాగబోనని ప్రకటన

### ప్రస్తుత పదవీకాలం 2027 ఫిబ్రవరి 20తో ముగింపు



**న్యూఢిల్లీ,ఆగష్టు 12,(ప్రజావినికిడి):**
టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుత పదవీకాలం ముగిసిన తర్వాత మరోసారి చైర్మన్‌గా కొనసాగకూడదని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు బుధవారం టాటా సన్స్ బోర్డుకు తన నిర్ణయాన్ని తెలియజేశారు. ఆయన ప్రస్తుత పదవీకాలం 2027 ఫిబ్రవరి 20న ముగియనుంది. అంటే అప్పటివరకు చైర్మన్‌గా కొనసాగుతారు. ఆగస్టు 18న జరగనున్న కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశానికి ముందు ఈ పరిణామం చోటుచేసుకుంది. **2లో...**

## ఎల్బీనగర్‌లో విషాదం

### : ఏసీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

### విధి నిర్వహణలో ఉన్న జె. సాయి కుమార్ బలవన్మరణం

### 2024 బ్యాచ్‌కు చెందిన అధికారిగా గుర్తింపు

### ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసుల దర్యాప్తు

### పోలీస్ స్టేషన్ ఎదుట మృతుని కుటుంబ సభ్యుల ఆందోళన

**హైదరాబాద్ఆగష్టు 12,(ప్రజావినికిడి):**
హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విధి నిర్వహణలో ఉన్న ఓ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. మృతుడిని 2024 బ్యాచ్‌కు చెందిన జె. సాయి కుమార్‌గా గుర్తించారు.వివరాల్లోకి వెళ్తే, సాయి కుమార్ ప్రస్తుతం ఈ–కాప్స్ విధుల్లో **మిగతా 2లో...**



## తెలంగాణ ఇళ్ల సౌకర్యం పెంచండి

### ఇళ్ల కేటాయింపులో రాష్ట్రా నికి ప్రాధాన్యం ఇవ్వండి

### కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌కు పొంగులేటి వినతి

**న్యూఢిల్లీ,ఆగష్టు 12,(ప్రజావినికిడి):**
ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద తెలంగాణ రాష్ట్రానికి సమగ్ర ప్రాతిపదికన ఒకేసారి 11,56,915 ఇళ్లను కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పొంగులేటి కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ముఖ్యమంత్రి . రేవంత్‌రెడ్డి రాసిన లేఖను ఈ సందర్భంగా పొంగులేటి గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇళ్ల కేటాయింపు**మిగతా 2లో...**



## ప్రతిపక్ష హోదా కోరుకుంటే రాదు

### సంఖ్యా బలం ఉంటేనే వస్తుంది

### అసెంబ్లీకి రాని ఎమ్మెల్యలే అనర్హతను పరిశీలిస్తున్నాం

### అసెంబ్లీ ఆవరణలో 14,15 తేదీల్లో స్వాతంత్ర్య ఉత్సవాలు

### ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడి

**అమరావతి,ఆగష్టు 12,(ప్రజావినికిడి):**
ప్రతిపక్షం అనేది ఒక హోదా..., అది సరిపడా సంఖ్యాబలం ఉంటేనే దక్కుతుందని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. అది కోరుకుంటే వచ్చేది కాదని అన్నారు. పరోక్షంగా వైసిపి డిమాండ్‌పై స్పీకర్ స్పందించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అసెంబ్లీ ప్రాంగణంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో విద్యార్థులతో పాటు ఎవరైనా పాల్గొనవచ్చున్నారు. సాయంత్రం**మిగతా 2లో...**



## నేత కార్మికుడి హత్య దుర్మార్గపు చర్య

### రాజకీయ కక్షల కోసం సామాన్యుడిని చంపేస్తారా

### కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలి

### అసలు హంతకులను పట్టుకుని శిక్షించాలి

### వెంకటేశం కుటుంబాన్ని పరామర్శించిన కెటిఆర్



2లో.



## గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి

### గోదావరి జలాల వినియోగంపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

### ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి నీటిని లిఫ్ట్ చేయాలని సీఎం ఆదేశం

### కాళేశ్వరం బ్యారేజీల భద్రతపై ఎన్డీఎస్ఏ సూచనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం

**హైదరాబాద్ ఆగష్టు 12,(ప్రజావినికిడి):**
గోదావరి నదీ జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా నీటి ఎత్తిపోతల (లిఫ్ట్) ప్రక్రియను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నీటిపారుదల శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.**మిగతా 2లో...**

# నేత కార్మికుడి హత్య దుర్మార్గపు చర్య

**రాజన్నసిరిసిల్ల,,ఆగష్టు 12,(ప్రజావినికిడి):**
సిరిసిల్లలో హత్యకు గురైన నేత కార్మికుడు వెంగళ వెంకటేశం కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. వెంకటేశం మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కేటీఆర్ ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీనిచ్చారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ చిన్నారి పేరు ప్రసన్న. ఐదో తరగతి చదువుతోంది. క్షుద్ర రాజకీయాలు, చిల్లర రాజకీయాల వల్ల ఈ పాప తండ్రిని కోల్పోయింది. ఎందుకు ఆమె తండ్రి చనిపోయాడు.. ఏదైనా చేసి రాజకీయ లబ్ది పొందాలే. అవసరమైతే మనుషుల ప్రాణాలు తీసైనా సరే.. చంపేసి అయినా సరే రాజకీయంగా బద్నాం చేయాలే.. అనే ఒకే ఒక చిల్లర ప్రయత్నంలోవెంగళ వెంకటేశం మన మధ్యలో లేకుండా పోయారు. వాళ్ల భార్య, పాప, తల్లిని అనాథలను చేసి ఆయన పోయారు. రాష్ట్ర రాజకీయాల్లో 20 ఏండ్లుగా నేను కూడా ఉన్నా. ఇంకా చాలా పెద్దలు ఇక్కడ సీనియర్లు కూడా ఉన్నారు. నేను ఎన్నడూ ఇంత దిగజారుడు రాజకీయం, ఇంత దరిద్రపుగొట్టు రాజకీయం జీవితంలో కూడా చూడలేదన్నారు. మా నాన్న రాలేదు..మూడు రోజులు నేను తినలేదు అని ఆ పాప ఏడుస్తూ చెప్తుంటే మనసున్న మనిషి కళ్లల్లో నీళ్లు తిరగక మానవు. గుండె ద్రవించక మానదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మమ్మల్ని రాజకీయంగా ఎదుర్కోవాలి అనుకుంటే ఎన్నికల్లో తలపడొచ్చు? లేదా నాయకులతో విమర్శలు చేయొచ్చు. మీరు ఇప్పటికే చేస్తున్నట్టుగా కేసులుపెట్టొచ్చు.. వేధించొచ్చు. కానీ మధ్యలో సామాన్యులను సమిధలుగా చేసి, బలిపశువులను చేసి వాళ్ల జీవితాలను ఆగం చేస్తే ఏమొస్తదని కాంగ్రెస్ పార్టీ నాయకులను అడుగుతున్నా. చనిపోయింది వెంకటేశం.. అరెస్ట్ చేసింది చోటామోటా కాంగ్రెస్ నాయకులను. కానీ ఆ చోటమోటా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేవలం పాత్రదారులు మాత్రమే. అసలు సూత్రదారులు పెద్దవాళ్లు వెనకాల ఉన్నరు.. తప్పించుకున్నారు. కానీ మేం వదిలిపెట్టం. వెంకటేశం భార్య మమ్మల్ని అడిగింది. అన్నా న్యాయం జరిగేదాకా మాతో ఉండండి అని అడిగింది. ఇల్లుతో ఇబ్బందికరంగా ఉంది. కొత్త ఇల్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకుల దగ్గరకుపోతే దాని కోసం నెలరోజులుగా తిప్పించుకుని ఇవాళ ఈ పరిస్థితి తెచ్చారని కేటీఆర్ మండిపడ్డారు. అందుకే నేనిప్పుడే కలెక్టర్‌తో మాట్లాడి చెప్పిన.. మీరు ఇల్లు ఇస్తరా.. ఇవ్వండి లేదా మా పార్టీ తరపున మేం ఇల్లు కట్టిస్తమనిచెప్పినం. ఇప్పుడు ఆ పాపకు 11 ఏండ్లు. ఆమె పేరు మీద రూ.3 లక్షలు పిక్స్‌డ్ డిపాజిట్ చేసినం. ఆమె 18 ఏండ్లు నిండి మేజర్ అయిన తర్వాత మెచ్యూర్ అయ్యేలా డిపాజిట్ కూడా చేశాం. ఆ పాప పదోతరగతి దాకా నేనే చదివిపిస్తానని చెప్పా. చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాలనేచిల్లర ప్రయత్నం స్థానిక సిరిసిల్ల కాంగ్రెస్ నాయకత్వం చేసిందో ఇదిఎన్నటికీ కూడా క్షమించరాని నేరం. సభ్య సమాజం కూడా అసహ్యించుకునే దుర్మార్గమైన పరిస్థితని అన్నారు. దయచేసి ఈ కుటుంబానికి న్యాయంచేయాలని పోలీస్ అధికారులను కోరుతున్నానని అన్నారు. ప్రజాప్రతినిధిగా డిమాండ్ చేస్తున్నా. వదిలిపెట్టమని కేటీఆర్ హెచ్చరించారు.

## ప్రతిపక్ష హోదా కోరుకుంటే రాదు

**మొదటిపేజీ తరువాయి**
పూట ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్వాతంత్య్ర ఉద్యమ ఘట్టాలను ప్రదర్శిస్తామన్నారు. పోలీసు బ్యాండ్‌తో పాటు సంస్కృతిక కార్యక్రమాలను.. ఆ రెండు రోజుల పాటు అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహిస్తామని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. వైకాపా ఎమ్మెల్యేలు సభకు హాజరు కావడం లేదని.. అలాంటి వారికి జీతాలు ఎందుకు ఇవ్వాలని అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ఎమ్మెల్యేలు శాసనసభకు హాజరుకాకపోవడమేంటన్నారు. సభకు రాని వారికి వేతనాలు ఇవ్వకూడదని.. ఈ అంశాన్ని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరిగి చట్టం తీసుకురావాలని అయ్యన్నపాత్రుడు అభిప్రాయపడ్డారు. సభకు రానివాళు ఎమ్మెల్యేలుగా ఎందుకున్నారు?కొందరు సభ్యుల దొంగ సంతకాలను అరికట్టేందుకే ఫేస్ రికగ్నిషన్ పెట్టాం. 6 నెలల పాటు సభకు రాకుంటే అనర్హత వేటు వేసే అంశం చర్చల స్థాయిలో ఉంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి మార్గనిర్దేశం చేస్తుందో చూస్తున్నాం. అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు క్వార్టర్స్ కేటాయింపుపై సాధారణ పరిపాలన శాఖతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం అని అయ్యన్న తెలిపారు. ఆరు నెలలుగా అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలపై అనర్హత వేటు అంశం వివిధ స్థాయిలో చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. కేందప్రభుత్వం దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్లామని.. తమకు ఎలాంటి మార్గనిర్దేశం చేస్తుందో వేచి చూస్తున్నామని వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి రాని సభ్యులకు కొత్త ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ప్లాట్స్ కేటాయించాలా. అని ప్రశ్నించారు. ఈ విషయంపైనా ప్రభుత్వ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటా మని తెలిపారు. ఎమ్మెల్యేలకు క్వార్టర్స్ కేటాయింపు జీఏడీపై తాము చర్చించి నిర్ణయం తీసుకుంటామని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. అసెంబ్లీకి రాని వారు ఎమ్మెల్యేగా ఎందుకని ప్రశ్నల వర్షం కురిపించారు. హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఒకే లిఫ్ట్ ఉన్నందున పెద్ద వయస్సు ఉన్న వారు కింది అంతస్తులు కోరుకునేవారని ప్రస్తావించారు. అమరావతిలో మాత్రం ఎక్కువ లిఫ్ట్‌లు అందుబాటులో ఉండటం, వెంటిలేషన్, కాలుష్యం తక్కువ తదితర కారణాలతో పెద్ద వయస్సు ఎమ్మెల్యేలు పై అంతస్తులను కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

## షార్ట్‌కట్ కోసం వెంపర్లాడితే నష్టపోతాం

**మొదటిపేజీ తరువాయి**
చేరుకునేందుకు ఫుట్‌బ్రిడ్జ్‌లను వాడకుండా రైల్వే ట్రాక్‌లను దాటుతుంటారని మోదీ గుర్తుచేశారు. అలాంటి వారికోసమే రైల్వే స్టేషన్లలో బోర్డులపై ప్రదర్శించే హెచ్చరికలు జీవిత పాఠాలను నేర్పుతాయన్నారు. మన ఆలోచనలపై ప్రభావం చూపించే ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి. మీరు ముందుకు వెళ్లే మార్గం కావాలనుకుంటే.. మీరు ఆరాధించే వ్యక్తుల ఆత్మకథ చదవండని సూచించారు. ఇటీవల కాలంలో మోదీ జెన్‌జీ యువతతో కనెక్ట్ అయ్యేలా తన సోషల్ మీడియా యాక్టివిటీలో మార్పులు చేసుకుంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో సెల్ఫీ వీడియోలను పోస్టు చేస్తున్నారు. యువత వాడే భాషను ఉపయోగిస్తున్నారు. అదే సమయంలో రీల్స్‌కే పరిమితం కాకుండా కెరీర్‌పైనా దృష్టిపెట్టాలని సూచించారు. ఇదిలా ఉంటే.. కోవింద్ రాసిన పుస్తకావిష్కరణ కార్యక్రమం దిల్లీలో జరిగింది.

## రాజ్యసభను కుదిపేసిన లుంగీవాలా వివాదం

**మొదటిపేజీ తరువాయి**
సమయంలో, పంచె కట్టుకుని ఉన్న తనను చూసి వెనుక సీటులో కూర్చున్న సుస్మితా దేవ్ పదేపదే 'లుంగీవాలా' అని సంబోధించారని బ్రిట్టాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇది దక్షిణాది సంస్కృతిని, మలయాళీలను అవమానించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గర్వించదగ్గ భారతీయుడినని, దక్షిణాది వాడినని పేర్కొంటూ, ఈ వ్యాఖ్యలపై సుస్మితా దేవ్‌పై హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చినట్లు వెల్లడించారు.ఈ ఆరోపణలను సుస్మితా దేవ్ తీవ్రంగా ఖండించారు. తాను అసోంకు చెందిన బెంగాలీనని, వివిధ రాష్ట్రాల వస్త్రధారణ పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అసత్యాలు చెబుతున్నారని, ఏ విచారణలోనైనా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, మతపరమైన గుర్తింపులపై బ్రిట్టాస్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై ఆమె కూడా ప్రివిలేజ్ నోటీసు దాఖలు చేశారు.ఈ వివాదంపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. కొందరు ఎంపీలు పార్లమెంట్ వెలుపల పంచెకట్టుతో నిరసన తెలిపారు. సభా నాయకుడు జె.పి. నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడాలని సభ్యులను కోరారు. సభ్యులు ఒకరి సాంస్కృతిక సంప్రదాయాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయవద్దని సూచించిన చైర్మన్, ఇరుపక్షాలను తన ఛాంబర్‌కు పిలిచి సమస్య పరిష్కారానికి ప్రయత్నించారు. ప్రస్తుతం ఇరుపక్షాలు అందజేసిన హక్కుల ఉల్లంఘన నోటీసులు చైర్మన్ పరిశీలనలో ఉన్నాయి

## గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి

**మొదటిపేజీ తరువాయి**
ఈ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సిఫార్సుల మేరకు ప్రస్తుతం సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలలో నీటిని నిల్వ చేయడం లేదని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలను అధికారులు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలలో కొన్ని లోపాలను గుర్తించినట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించగా, ఈ అంశంపై తక్షణమే ఎన్డీఎస్ఏను సంప్రదించాలని సీఎం సూచించారు. దేవాదుల ప్రాజెక్టులో తొమ్మిది పంపుల ద్వారా నీటిని లిఫ్ట్ చేయడం కీలకమని, అక్కడ ఎదురవుతున్న చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.
వివిధ ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై కూడా ఈ సమావేశంలో సమీక్షించారు. నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముంపునకు గురయ్యే గ్రామాలు, పెండింగ్ పరిహారం, పునరావాస ప్యాకేజీలపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికలు అందజేయాలని రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. బాధితులకు త్వరితగతిన పరిహారం చెల్లిస్తేనే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టులను నింపడానికి వీలవుతుందని ఆయన పేర్కొన్నారు.
గట్టు, గుడెందొడ్డి ఎత్తిపోతల పథకాల సామర్థ్యం పెంపుపై తగిన అధ్యయనం చేయాలని, గుడెందొడ్డి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు కన్సల్టెంట్‌ను నియమించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## టాటా సన్స్ ఛైర్మన్ పదవికి గుడ్‌బై..

**మొదటిపేజీ తరువాయి**
చంద్రశేఖరన్ మరో ఐదేళ్ల పదవీకాలానికి కొనసాగింపుపై గతంలో ప్రతిపాదన వచ్చింది. సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్, సర్ రతన్ టాటా ట్రస్ట్‌లు ఏకగ్రీవంగా ఆయన పదవీకాలాన్ని పొడిగించాలని సిఫార్సు చేశాయి. టాటా సన్స్ నామినేషన్, రెమ్యునరేషన్ కమిటీ, బోర్డు కూడా ఈ ప్రతిపాదనను సిఫార్సు చేశాయి.అయితే 2026 ఫిబ్రవరి 24న జరిగిన బోర్డు సమావేశంలో ఓ సభ్యుడు ఈ ప్రతిపాదనకు మద్దతు ఇవ్వలేదు. ఏకాభిప్రాయం లేకపోవడంతో తాను నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు చంద్రశేఖరన్ తెలిపారు. ఆ సమావేశానికి ఆరు నెలలు గడిచినా ఇప్పటివరకు దీనిపై నిర్ణయం రాలేదని చెప్పారు.
టాటా షేర్లలో అమ్మకాలుచంద్రశేఖరన్ రాజీనామా వార్త వెలువడటంతో టాటా గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. టీసీఎస్ షేరు 4.1 శాతం వరకు పడిపోయింది. టాటా మోటార్స్ 2.8 శాతం క్షీణించింది. గ్రూప్‌లోని కొన్ని షేర్లు 4 శాతం వరకు నష్టపోయాయి.

## ఎల్బీనగర్‌లో విషాదం

**మొదటిపేజీ తరువాయి**

భాగంగా ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయానికి అటాచ్ అయి పనిచేస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున సుమారు 2:30 గంటల సమయంలో, విధుల్లో ఉన్న ఆయన కార్యాలయంలోని రెస్ట్ రూమ్‌లో బలవన్మరణానికి పాల్పడ్డారు.ఈ విషయాన్ని గమనించిన తోటి సిబ్బంది వెంటనే ఆయన్ను సమీపంలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కర్మన్‌ఘాట్‌లో తన స్నేహితులతో కలిసి గదిలో నివసిస్తున్న సాయి కుమార్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుని కుటుంబ సభ్యులు ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ విషాద ఘటనతో పోలీస్ శాఖలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# తెలంగాణ ఇళ్ల సౌకర్యం పెంచండి

**మొదటిపేజీ తరువాయి**
పక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.
రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్ 2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు పక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ ఉందని తెలిపారు. ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. కేంద్ర వాటా, సాధారణ రాష్ట్ర వాటాతో సంబంధం లేకుండా ప్రతి పేద కుటుంబం ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బ్జడెట్‌లో కేటాయించినట్లు స్పష్టం చేశారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాలని పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా రాష్ట్రానికి వచ్చి ఖఓంజ-ఉ 2.0 కింద ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని చెప్పుకొచ్చారు. అది చరిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్?2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు పక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ పేరుకుపోయినందున, ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. ఇకపోతే కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని, అది చారిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేష్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు.

# మిల్లర్ల బకాయిలు వసూలు చేయాల్సిందే

**మొదటిపేజీ తరువాయి**
కలిసి సీఎం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలకు అవకాశం ఇచ్చి, తిరిగి ఆ తప్పిదాన్ని తమ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే బకాయిల వసూళ్లలో కొంత పురోగతి ఉందని, అయితే ప్రతి ధాన్యం గింజకు చెందిన బకాయిని వసూలు చేయాల్సిందేనన్నారు. వసూళ్లకు సంబంధించి విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయించి మిల్లింగ్ బాధ్యతలను ఆయా సంఘాలకే అప్పగిస్తామని తెలిపారు.
ప్రతీ సీజన్‌లో ధాన్యం నిల్వలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. ధాన్యం భారీగా వచ్చే నల్లగొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలను పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని ఆదేశించారు. వాటి నిర్మాణాలకు స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ ) ఆధ్వర్యంలో నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని సీఎం తెలిపారు. ఇందుకు సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీబీ గ్రామ్‌జీలో ఫ్లాట్‌పాంల నిర్మాణానికి అవకాశం ఉన్న నేపథ్యంలో విశాలమైన ఫ్లాట్‌పాంలు నిర్మించటంతోపాటు జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రయివేటు గోదాములు, ధాన్యం నిల్వలకు ఉపయోపపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి లీజుకు తీసుకోవాలని సూచించారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సౌత్ ఇండియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తూడి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు అధ్యక్షతన 20వ ఎస్ఐపీబీ సమావేశం...

**అమరావతిఆగష్టు 12,(ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతికి ఊతమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో భారీ పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదముద్ర లభించింది. పరిశ్రమలు, ఇంధనం, ఐటీ ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల్లో మొత్తం 25 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,08,406 కోట్ల విలువైన పెట్టుబడులకు బోర్డు ఏకగ్రీవంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా 21,627 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.



**20వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల పూర్తి వివరాలు::**

1. ఓకెయిర్ గ్రీన్ ఫ్యూయెల్స్: కర్నూలు జిల్లా, రూ.616 కోట్లు, 130 ఉద్యోగాలు
2. జాక్సన్ గ్రీన్ రెన్యూవబుల్: కర్నూలు జిల్లా, రూ.1533 కోట్లు, 250 ఉద్యోగాలు
3. ఎఫ్ పీఈఎల్ రవ్వేద పవర్: విజయనగరం జిల్లా, రూ.480 కోట్లు, 275 ఉద్యోగాలు
4. వారీ క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్: కాకినాడ జిల్లా, రూ.15,000 కోట్లు, 1500 ఉద్యోగాలు
5. ఆరాధ్యా బయోగ్యాస్: కర్నూలు జిల్లా, రూ.143.47 కోట్లు, 595 ఉద్యోగాలు
6. ఉషోదయా బయోగ్యాస్: నెల్లూరు జిల్లా, రూ.143.47 కోట్లు, 595 ఉద్యోగాలు
7. డేటా సెంటర్ హోల్డింగ్స్ ఇండియా: విశాఖపట్నం, రూ.58,743 కోట్లు, 1250 ఉద్యోగాలు
8. మునోథ్ లీథియం బ్యాటరీ లిమిటెడ్: తిరుపతి జిల్లా, రూ.500 కోట్లు, 240 ఉద్యోగాలు
9. ఏఐఎల్ డిక్సన్ ఇండియా లిమిటెడ్: కడప జిల్లా (కొప్పర్తి), రూ.450 కోట్లు, 7000 ఉద్యోగాలు
10. రెన్యూ ఏపీ గ్రీన్ డేటా సెంటర్: అనకాపల్లి జిల్లా, రూ.85,200 కోట్లు, 1880 ఉద్యోగాలు
11. ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ లిమిటెడ్: విశాఖ జిల్లా, రూ.31,387 కోట్లు, 1000 ఉద్యోగాలు
12. సీఆర్ఆర్ హాస్పిటాలిటీ ఎల్ఎల్‌పీ: తిరుపతి జిల్లా, రూ.192.02 కోట్లు, 200 ఉద్యోగాలు
13. ఆర్కే 2 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్: తిరుపతి జిల్లా, రూ.150 కోట్లు, 150 ఉద్యోగాలు
14. సన్ రైజ్ హోటల్స్ ఇండియా లిమిటెడ్: కాకినాడ జిల్లా, రూ.54 కోట్లు, 75 ఉద్యోగాలు
15. జెఎస్పీ హోటల్స్, రిసార్ట్స్ ఎల్ఎల్‌పీ: కృష్ణా జిల్లా, రూ.63.79 కోట్లు, 100 ఉద్యోగాలు
16. పావులూరి హోటల్స్: తిరుపతి జిల్లా, రూ.58.74 కోట్లు, 150 ఉద్యోగాలు
17. అగస్త్యా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్: కర్నూలు జిల్లా, రూ.7799.96 కోట్లు, 1000 ఉద్యోగాలు
18. అక్షత్ గ్రీన్ టెక్ లిమిటెడ్: విశాఖపట్నం జిల్లా, రూ.1600 కోట్లు, 750 ఉద్యోగాలు
19. కోరమాండల్ ఇంటర్నేషనల్: శ్రీకాకుళం జిల్లా (మూలపేట), రూ.2125 కోట్లు, 400 ఉద్యోగాలు
20. హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్: చిత్తూరు జిల్లా (కుప్పం), రూ.880 కోట్లు, 447 ఉద్యోగాలు
21. ఎస్ట్రేలా లాజిస్టిక్స్: విశాఖపట్నం జిల్లా, రూ.90 కోట్లు, 100 ఉద్యోగాలు
22. గణేష్ సాయి మౌనిష స్టీల్ వైర్స్: విజయనగరం జిల్లా, రూ.66 కోట్లు, 120 ఉద్యోగాలు
23. వీపీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్: నెల్లూరు జిల్లా (మనుబోలు), రూ.500 కోట్లు, 2000 ఉద్యోగాలు
24. జయాదిత్యా ఆగ్రో లిమిటెడ్: కర్నూలు జిల్లా, రూ.300 కోట్లు, 350 ఉద్యోగాలు
25. ప్రిసోల్ ఆగ్రో ఇండస్ట్రీస్: నెల్లూరు జిల్లా, రూ.330.71 కోట్లు, 1110 ఉద్యోగాలు

# ఫ్రాడ్ కు ఫుల్ స్టాప్,సైబర్ మోసాలపై అప్రమత్తతే రక్షణ..

## షాద్‌నగర్ సీఐ సీతారాం..

**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
డిజిటల్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడం ద్వారా సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చని షాద్‌నగర్ పోలీసులు తెలిపారు. షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్న చిల్కమర్రి గ్రామంలోని ఎమ్ ఎస్ ఎన్ సంస్థ ప్రాంగణంలో ఉద్యోగులు,
వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం సైబర్ నేరాల అవగాహన కార్యక్రమం రెండో వారపు సెషన్‌ను నిర్వహించారు. ఫ్రాడ్‌కు ఫుల్‌స్టాప్ అనే లక్ష్యంతో డిజిటల్ భద్రత,ఆర్థిక మోసాల నివారణపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా సైబర్ నిపుణులు, పోలీస్ అధికారులు మాట్లాడుతూ,
ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వివిధ రకాల సైబర్ మోసాలపై వివరించారు. నకిలీ స్టాక్ మార్కెట్,ట్రేడింగ్ యాప్‌లు,అధిక లాభాల పేరుతో మోసాలు, అనధికారిక డిజిటల్ లోన్ యాప్‌లు,ఫిషింగ్ లింకుల ద్వారా వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాల చోరీ వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని



సూచించారు.బ్యాంకింగ్,వ్యక్తిగత ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు వినియోగించడంతో పాటు టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ (2 ఎఫ్ఏ) తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.పబ్లిక్ వై-ఫై ద్వారా బ్యాంకింగ్ లావాదేవీలు చేయకూడదని, అనుమానాస్పద ఎస్ఎంఎస్ లు, వాట్సాప్ సందేశాలు, లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు.
సైబర్ మోసానికి గురైతే వెంటనే స్పందించడం అత్యంత కీలకమని, బాధితులు ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే cybercrime.gov.inలో ఫిర్యాదు నమోదు చేయాలని అధికారులు సూచించారు.
అనంతరం నిర్వహించిన ప్రశ్నలు-సమాధానాల




కార్యక్రమంలో ఉద్యోగులు (యూపీఐ) భద్రత,వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో వచ్చే నకిలీ ఉద్యోగ ఆఫర్లు, గుర్తింపు చోరీ తదితర అంశాలపై అడిగిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.
ప్రతి ఒక్కరూ డిజిటల్ అవగాహన పెంచుకుని, అపరిచిత లింకులు, అనుమానాస్పద కాల్స్, సందేశాలకు స్పందించకుండా జాగ్రత్త వహించాలని షాద్‌నగర్ పోలీస్ అధికారి సీఐ సీతారాం కోరారు.

# రెండేళ్లు అయినా నూతన పైపులైన్ ఏది.?

## సిపిఎం మహేందర్




**అంబర్ పేట్, (ప్రజావినికిడి):** నూతన పైపు లైను శాంక్షన్ అయ్యి రెండేళ్లు పూర్తయిన కూడా ఇప్పటివరకు పైపు వేయకపోవడం ఏమిటని అంబర్పేట్ సిపిఎం నాయకులు మహేందర్ ప్రభుత్వ అధికారులను నిలదీశారు. గాయత్రి అపార్ట్మెంట్ ప్రాంతాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాగ్ అంబర్ పేట్ డివిజన్ లోని వైభవ్ నగర్ కాలనీ గాయత్రి అపార్ట్మెంట్ ప్రాంతంలో రహదారిపై చిన్నపాటి వర్షం పడితే మినీ బతుకమ్మ కుంటలా మారుతుందని దుయ్యబట్టారు. గాయత్రి అపార్ట్మెంట్ నుండి బతుకమ్మ కుంట నాలా వరకు నూతన పైపులైను శాంక్షన్ అయి రెండు సంవత్సరాలు అవుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కాలనీ చుట్టుపక్క ప్రాంతాల్లో హాస్పిటల్స్ కు వెళ్లే పేషెంట్లు, స్కూలుకు వచ్చే విద్యార్థులకు వర్షం వచ్చినప్పుడల్లా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన తెలిపారు. అధికారులు ఎప్పటికైనా తక్షణమే స్పందించి నూతన పైప్ లైన్ ను వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.నాగేందర్, బాలపర్,సత్య, జనార్ధన్,సురేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు మరింత పెంచాలి..

**విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం..**

**క్షేత్రస్థాయి పర్యవేక్షణను నిరంతరం కొనసాగించాలి. అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి..**

**రంగారెడ్డి,(ప్రజావినికిడి):రంగారెడ్డి**
జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని మరింత పెంచడంతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ శ్రీమతి డాక్టర్ కిరణ్మయి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.
బుధవారం జిల్లా ఐ డి ఓ సి భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి,స్టేట్ టాస్ డైరెక్టర్ శ్రీ లింగయ్య ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు వివిధ విద్యా అంశాలపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని అన్ని మండలాల విద్యాధికారులు ( ఎంఈఓలు), కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు,సీఆర్ పి లు,జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండలాల వారీగా విద్యాశాఖ కార్యక్రమాల అమలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, పాఠశాలల పనితీరు, విద్యార్థుల హాజరు,విద్యా ప్రమాణాల మెరుగుదల, క్షేత్రస్థాయి పర్యవేక్షణ తదితర అంశాలపై అదనపు కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ప్రతి మండలంలోని పరిస్థితులను సంబంధిత ఎంఈఓ లు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత గొప్పదని పేర్కొన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం



కాకుండా వారిలో క్రమశిక్షణ,నైతిక విలువలు, బాధ్యతాయుతమైన పౌరసత్వ భావనను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు మరింత పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.ప్రతి అర్హత కలిగిన విద్యార్థి పాఠశాలలో చేరేలా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్య,మౌలిక వసతులు,వివిధ ప్రభుత్వ సదుపాయాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల నమోదు పెంపుతో పాటు వారు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడంవిద్యా ప్రమాణాలను పెంపొందించడం ప్రతి ఉపాధ్యాయుడి ప్రధాన బాధ్యతగా భావించాలని అదనపు కలెక్టర్ సూచించారు. పాఠశాలల స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.
స్టేట్ టాస్ డైరెక్టర్ శ్రీ లింగయ్య మాట్లాడుతూ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు,ఎంఈఓ లు క్షేత్రస్థాయిలో పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించాలని



సూచించారు. పాఠశాలల్లో వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించి, ఉపాధ్యాయులు విద్యార్థులతో మాట్లాడి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిరంతరం కొనసాగినప్పుడే విద్యాశాఖ కార్యక్రమాల అమలులో ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని ఆయన పేర్కొన్నారు. పాఠశాలల పనితీరును మెరుగుపరిచేందుకు ఎంఈఓ లు,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు,సి అర్ పి లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల నమోదు, హాజరు, అభ్యసన ఫలితాలు తదితర అంశాలపై నిరంతరం దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.
జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ వెంకటేశ్వర్లు సమావేశంలో సమీక్షించిన అంశాలు, శాఖాపరంగా చేపడుతున్న కార్యక్రమాలు, మండలాల వారీగా విద్యా పరిస్థితులను వివరించారు. అనంతరం అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు,సి అర్ పి లకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు.సమావేశంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు, అన్ని మండలాల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు,సిఅర్ పి లు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ చింతల స్రవంతికి గ్లోబల్ యూత్ అవార్డు ప్రదానం




**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి):** దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి కేవలం యువతకే ఉందని దేశ ప్రగతిలో యువత పాత్ర ఎనలేనిదని ఉస్మానియా యూనివర్సిటీ అడ్మిషన్స్ జాయింట్ డైరెక్టర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మొహమ్మద్ అక్తర్ అన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా టిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు.దేశ యువత భవిష్యత్తు ప్రగతికి సేవ గుణానికి పెద్దపీట వేసి దేశ ఐక్యతకు అభివృద్ధికి పాటుపడాలని యువతకు పిలుపునిచ్చారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ, యువతకు నాణ్యమైన విద్య, గౌరవప్రదమైన ఉపాధి, సమాజంలో సమాన భాగస్వామ్యం, మెరుగైన జీవన ప్రమాణాలు వంటి అంశాలపై అవగాహన పెంచడమే అంతర్జాతీయ యువజన దినోత్సవం 2026 ప్రధాన ఉద్దేశం అని వివరించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పన్ గోరక్ష డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ ప్రేమ్చంద్ మునోత్ జైన్ మాట్లాడుతూ యువత కేవలం దేశ భవిష్యత్తు మాత్రమే కాదని, ప్రస్తుతం ఇది అతి పెద్ద బలమని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గోరక్ష ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రితీష్ జాగిర్ధన్, టిసిసి కోఆర్డినేటర్లు జి.వేణుగోపాల్. బిచ్చుచారి, సూర్య,టిసిసి ఉపాధ్యక్షులు కే. రవీందర్,ప్రధాన కార్యదర్శి, ప్రముఖ విద్యావేత్త ముహమ్మద్ అక్తర్ షరీఫ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ ఆసుపత్రిలో కార్డియాలజీ విభాగం వైద్యురాలిగా సేవలందిస్తున్న డాక్టర్ చింతల వాసంతికి ఇండిగో ఎయిర్లైన్స్ శంషాబాద్ బేస్ లో పైలట్ గా పనిచేస్తున్న కుమారి సి.స్రవంతి లకు గ్లోబల్ యూత్ అవార్డు 2026ను శాలువా, పూలమాల, జ్ఞాపికతో ఘనంగా సన్మానించి అవార్డు ప్రదానం చేసి అభినందించారు




# నాగోల్‌లో ఘనంగా తిరంగా ర్యాలీ..

**నాగోల్,(ప్రజావినికిడి):**




ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా అభియాన్ లో భాగంగా నాగోల్ డివిజన్ పరిధిలో బుధవారం రోజు హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు.దేశభక్తి,జాతీయ సమైక్యత,దేశ సేవా స్ఫూర్తిని ప్రజల్లో మరింతగా పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ ర్యాలీలో బీజేపీ ఎల్బీనగర్ ఇంచార్జ్ సామ రంగారెడ్డి, నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.జాతీయ జెండాలను చేతబట్టి,భారత్ మాతాకీ జై వందే మాతరం వంటి నినాదాలతో ర్యాలీ కొనసాగింది. యువత, మహిళలు, విద్యార్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు.త్రివర్ణ పతాకం కేవలం ఒక జెండా కాదని,అది భారతదేశ గౌరవానికి, స్వాతంత్ర్యానికి, త్యాగానికి, ఐక్యతకు ప్రతీక అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులు, దేశ సరిహద్దుల్లో నిరంతరం సేవలందిస్తున్న వీర జవాన్ల త్యాగాలను ప్రతి భారతీయుడు ఎల్లప్పుడూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని నాయకులు పేర్కొన్నారు. ప్రపంచ వేదికపై భారతదేశం తన సామర్థ్యాన్ని మరింత బలంగా చాటుకుంటోందనిఆత్మనిర్భర్ భారత్,వికసిత్ భారత్ లక్ష్యాల దిశగా దేశం ముందుకు సాగుతోందని తెలిపారు.ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయడం ద్వారా దేశభక్తి భావనను ప్రతి కుటుంబానికి చేరువ చేయాలని, యువతలో జాతీయ స్ఫూర్తిని పెంపొందించాలని అన్నారు. త్రివర్ణ పతాకాన్ని గౌరవంగా ఎగురవేయడంతో పాటు,దాని విలువలను మన జీవితాల్లో ఆచరించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని తెలిపారు.దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని, కుల,మత, ప్రాంతాలకు అతీతంగా దేశం ముందు మనమంతా ఒక్కటే అనే భావనతో ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, బీజేవైఎం నాయకులు, విద్యార్థులు, యువత, కార్యకర్తలు, అభిమానులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వంగపూడి అనిత ను మర్యాద పూర్వకంగా కలిసిన

## గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ నేషనల్ చైర్మన్ దాసరి శ్వేత



**ఎల్బీనగర్, ఆగస్టు 12, (ప్రజావినికిడి)**
ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వంగపూడి అనిత ను ఏపీ టీడీపీ కార్యాలయంలో గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ నేషనల్ చైర్మన్, యువత బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ తెలుగు రాష్ట్రాల జనరల్ సెక్రటరీ దాసరి శ్వేత మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా దాసరి శ్వేత మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గౌరవ మంత్రివర్యులు హోం శాఖామాత్యులు అనిత ను కలవడం సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ,ఆర్థిక స్వావలంబన మహిళా సాధికారతకోసం సంపూర్ణ సహకారం అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలియజేశారు. మహిళలకు భద్రత అలాగే సంక్షేమ కార్యక్రమంలో తెలియ పరచటలో అవగాహన చేయుటలో దాసరి శ్వేత నేషనల్ చైర్మన్ ఫర్ యూత్ గ్లోబల్ వుమెన్ రైట్స్ అసోసియేషన్ ఇండియా ద్వారా ప్రతి ఒక్కరికి చట్టాలు తెలియ పరచాలని ఆధారంగా సదస్సు తెలపాలని విద్యార్థులకు మరియు మహిళలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుచున్నామని తెలియజేశారు. అదేవిధంగా విద్య వైద్య క్రీడలు అదేవిదంగా యోగా మెడిటేషన్ ఆరోగ్యానికి ఎంతో మంచిదని శ్వేత తెలిపారు.

# శ్రీ ఎస్.పి.ఆర్. గ్లోబల్ స్కూల్‌లో ఆషాఢ మాస బోనాల సంబరాలు..





**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని శ్రీ ఎస్.పి.ఆర్. గ్లోబల్ స్కూల్‌లో బుధవారం ఆషాఢ మాస బోనాల వేడుకలను పాఠశాల యాజమాన్య బృందం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించడంజరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని, బోనాల పండుగ విశిష్టతను తెలియజేస్తూ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.మన తెలంగాణ సంస్కృతి, వేషాధారణ సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది.

# సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన సదస్సు

**వాజేడు,ఆగష్టు 13,(ప్రజావినికిడి):**




పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం గ్రామంలో బుధవారం రోజు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పేరూరు ఎస్సై జి. కృష్ణప్రసాద్ గ్రామస్థులకు ప్రస్తుత కాలంలో పెరుగుతున్న వివిధ రకాల సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు,ఓటిపీ మోసాలు, బ్యాంక్ ఖాతా వివరాలు అలాగే ఎటిఎం /డెబిట్ కార్డు వివరాల దుర్వినియోగం, ఫేక్ లింకులు, సోషల్ మీడియా మోసాలు, యుపిఐ. మోసాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే,గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, వాట్సాప్ సందేశాలు లేదా అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, ఎవరికీ ఓటిపి, పిన్,సివివి, పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ ఖాతా వివరాలు వెల్లడించవద్దని ప్రజలకు సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే సంబంధిత బ్యాంకును వెంటనే సంప్రదించాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా సైబర్ నేరాలను గణనీయంగా నివారించవచ్చని, ఏదైనా అనుమానాస్పద ఆన్‌లైన్ లావాదేవీ జరిగినప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని ఎస్సై తెలిపారు.ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సైబర్ నేరాల నివారణకు సంబంధించిన సూచనలు, జాగ్రత్తలను తెలుసుకున్నారు

# దేశంలోనే ఏఐఎస్ఎఫ్ మొట్టమొదటి విద్యార్థి సంఘం.

## ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉమా మహేష్

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**



అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నేడు షాపూర్ నగర్ లో ఏర్పాటుచేసిన ఏఐఎస్ఎఫ్ పథకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఎగురవేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం సాధన కోసం దేశవ్యాప్తంగా ఉన్నటువంటి విద్యార్థులు అందరిని ఐక్యం చేసి పోరాటం నిర్వహించిన ఘనత ఈ దేశంలో కేవలం ఏఐఎస్ఎఫ్ కు మాత్రమే దక్కుతుందని అన్నారు. స్వాతంత్ర అనంతరం ప్రతి ఒక్క విద్యార్థులకు అందరికీ ప్రభుత్వమే బాధ్యతగా ఉచిత విద్యను అందించాలని శాస్త్రీయమైనటువంటి విద్యనందించాలని చదువుకున్న విద్యార్థి ప్రతి ఒక్కరికి ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యార్థులను రాజకీయాల్లోకి వచ్చి విద్యార్థులు ఈ దేశ భవిష్యత్తు నిర్మించాలని సదుద్దేశంతో దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఏఐఎస్ఎఫ్ కు ఉన్నదని అన్నారు. నేడు ఢిల్లీలో అలాగే జార్ఖండ్ లో జరిగిన విద్యార్థి ఉద్యమంలో కూడా ఏఐఎస్ఎఫ్ తన వంతు పాత్ర నిర్వహించి ప్రభుత్వాల మెడలను వచ్చే విధంగా కృషి చేసిందని, అన్ని రాజకీయ పార్టీలు ఓటర్లుగా ఉన్న వారికి మాత్రమే దృష్టిలో పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నాయని అందుకే అన్నింటి లోవిద్యార్థులు కూడా రాజకీయాల్లోకి వచ్చి మంచి విద్యా వ్యవస్థ కోసం పోరాటాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వంశీ జస్వంతులు నాయకత్వం వహించగా మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీనివాస్, స్వామి హాజరు కాగా విద్యార్థి సంఘ నాయకులు మహేష్ మహేందర్ శ్రీనివాస్ రమేష్ వినయ్ కీర్తిల తో పాటు సిపిఐ నాయకులు హరినాథ్ సంకిరెడ్డి నరసింహారెడ్డి లు తదితరులు పాల్గొన్నారు.

# ఆగష్టు 15 వరకు ప్రజలందరూ తమ ఇంటి పై జాతీయ జెండాను ఆవిష్కరించాలి

## : కేంద్ర ప్రభుత్వ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ నరేష్ కుమార్ నర్సింగోజు

**మేడిపల్లి,(ప్రజావినికిడి):**




భారతదేశ ఎనభైవ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతీ ఒక్క భారతీయుడు ఆగస్ట్ పదిహేనవ తారీకు వరకు తమ ఇంటి పై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి వేడుకలో భాగస్వాములు కావాలని కేంద్ర ప్రభుత్వ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్, అడ్వకేట్ నరేష్ కుమార్ నర్సింగోజు పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా మేడిపల్లి లోని ఉప్పల్ కోర్టు కాంప్లెక్స్ వద్ద అడ్వకేట్ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో హార్ ఘర్ తిరంగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మేడిపల్లి లోని ఉప్పల్ కోర్టు కాంప్లెక్స్ నుండి హనుమాన్ దేవాలయం వరకు న్యాయవాదులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ, భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశ ప్రజలందరూ ప్రతి ఇంటి పై జాతీయ జెండా ను ఆవిష్కరించి హార్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఉప్పల సుధాకర్, శ్రీకాంత్, రవి గౌడ్, వంశీకృష్ణ, చంద్రశేఖర్, భరత్, నరేష్, జయ, సూర్యం, స్వప్న, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ఫస్ట్ సౌత్ జోన్ లగోరి నేషనల్ ఛాంపియన్‌షిప్ తెలంగాణ ఘన విజయం





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** ఫస్ట్ సౌత్ జోన్ లగోరి నేషనల్ ఛాంపియన్‌షిప్ ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లిలో ఉన్న డీ పాల్ స్కూల్‌లో ఆగస్టు 8,9,2026 తేదీలలో ఘనంగా నిర్వహించారు ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల జట్లు పాల్గొన్నాయి.

ఈ పోటీలలో తెలంగాణ రాష్ట్ర బాయ్స్ టీమ్ అద్భుత ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో విజేతగా నిలిచింది. అలాగే తెలంగాణ గర్ల్స్ టీమ్ రెండవ స్థానంలో నిలిచి రన్నర్స్‌గా నిలిచింది.

తెలంగాణ రాష్ట్రం నుంచి రాష్ట్ర కార్యదర్శి పి.నవీన్ కుమార్, కోచ్ విశాల్, సచిన్, సుక్యునా క్రీడాకారులను ఎంతో ప్రోత్సహించి, విజయానికి తమ వంతు సహకారం అందించారు.

తెలంగాణ జట్లకు ఈ ఘన విజయం సాధించినందుకు హృదయపూర్వక అభినందనలు

తదుపరి లక్ష్యం జూనియర్ నేషనల్స్ రాయగడలో జరగనున్నాయి. తెలంగాణ జట్లు మరింత విజయాన్ని సాధించాలని కోరుకుందాం..అని అన్నారు

# 286 డివిజన్ లో ఘనంగా అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం..

## అమ్మవారి పూజ కార్యక్రమంలో పాల్గొన్న: బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 286 డివిజన్ లో ఆషాడ మాస బోనాల కార్యక్రమంలో భాగంగా గుడ్డి (ఆటో) బలరాం ఆధ్వర్యంలో అమ్మవారి పలహారం బండి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఆషాడ మాసంలో ఎంతో వైభవపేతంగా నిర్వహించే పండుగల్లో బోనాల పండుగ ఒకటి..సాంప్రదాయ దుస్తులను ధరించి అమ్మవారికి బోనాలు సమర్పించి బోనాల పండుగ విశిష్టత తెలియజేస్తూ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పోతరాజుల నృత్యాలు అందరిని ఆకట్టుకునే విధంగా ఉన్నాయని ఈ పండుగను ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రతి సంవత్సరం నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. అమ్మవారి దీవెనలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోగు సన్మాన నేత దోసాడ శ్రీనివాస్ ఆలయ కమిటీ సభ్యులు మహిళలు స్థానిక కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యను కాపాడుకుందాం

## ఘనంగా 91వ ఆవిర్భావ దినోత్సవం

**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి):**

91 ఏళ్ల విద్యార్థి ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వ విద్యను కాపాడేందుకు పోరాడుదామని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) మాజీ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన విద్యార్థి సంఘశీ జెండాను ధర్మేంద్ర ఎగురవేశారు. అనంతరం మిఠాయిల పంచి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ 12 ఆగస్టు 1936న ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం, లక్నో నగరం బెనారస్ విశ్వవిద్యాలయంలో ఆవిర్భవించిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య 91వ ఆవిర్భావ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటున్న మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని తెలిపారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో విద్యార్థులను ఐక్యం చేసి బ్రిటీష్



సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన ఏఐఎస్ఎఫ్ నాటి నుంచి ఉచిత, నాణ్యమైన విద్య, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, శాస్త్రీయ దృక్పథం కోసం నిరంతరం పోరాడుతోందన్నారు. చదువు- పోరాడు అనే నినాదంతో విద్యార్థుల హక్కుల కోసం సాగిన 91ఏళ్ల ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు మరింత బలమైన ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన జాతీయ విద్యా విధానం-2020ను వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు ఎన్ఈపీ పేరుతో విద్యా రంగంలో కేంద్రీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు మార్గం సుగమం చేసి, పేదమధ్యతరగతి విద్యార్థులకు విద్యను మరింత భారంగా మార్చే ప్రమాదం ఉందని వారు విమర్శించారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు నిధులు పెంచి బలోపేతం చేయాల్సిన సమయంలో విద్యా రంగాన్ని మార్కెట్ శక్తులకు అప్పగించే విధానాలను ఉపసంహరించుకోవాలని, ఉచిత-నాణ్యమైన విద్య, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సౌకర్యాలను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా విద్యార్థులు ఐక్యమై నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా, ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం ఉద్యమించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి జోసెఫ్ భాను, సుశాంత్, ఉపాధ్యక్షుడు లెనిన్, అరుణ్, రఘు, సమితి సభ్యులు అవినాష్, సురవరం నయోనిక, సాయితేజ, శివ, శశి, సుశాంత్, సుమన్, హరీష్, చరణ్, అనురాగ్, గణేష్, రోహిత్, మణికంఠ, యోగేంద్ర, హర్ష, సాహిల్, విధ్వాన్, సూర్యతేజ, ప్రదీప్, అభిషేక్, శ్రీగణేష్, అఖిల్, సాయి చరణ్, సాయి ప్రణవ్, మనిదీప్, రవళి, కీర్తన, ఫాతిమా, రమ్య, రేణుక లతో పాటు 30మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫిరంగి కాలువ ఆక్రమణలకు సంబంధించి హైడ్రా కమిషనర్ రంగనాథన్ ను కలిసిన తెలుగుదేశం పార్టీ బృందం..

## సకల ప్రాణులకు జీవాధారమైన పిరంగి నాలను పరిరక్షించండి..

## టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు..



గతంలో ఫిరంగినాలను పరిశీలిస్తున్న టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని.



**రంగారెడ్డి,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లాలో జర్మనీ ఇంజనీర్ల చేత 1872లో నిర్మించిన ఫిరంగి కాలువ సుమారు (104) కిలోమీటర్ల మేర ఉంటూ 28 పెద్ద గ్రామపంచాయతీలు 100 చిన్న గ్రామ పంచాయతీల పరిధిలో విస్తరించి ఉన్న ఈ ఫిరంగి కాలువ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం లోని చేవెళ్ల, రాజేంద్రనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల తోపాటు మహబూబ్ నగర్ పార్లమెంటు, షాద్ నగర్ ఈ (5) నియోజకవర్గల పరిధిలోని ప్రజలకు సాగు, త్రాగునీరుకు వరదాయనిగా ఉన్న ఫిరంగి కాలువ ఆక్రమణలకు గురై కాలువను ధ్వంసం చేయడం ద్వారా సాగు త్రాగునీరుకు నియోజకవర్గాలలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హైడ్రా కమిషనర్ కు వినతి పత్రం ద్వారా తెలియజేయడం జరిగింది. ప్రజలకు వరదాయనిగా ఉండేది అంతటి ప్రాధాన్యత కలిగిన ఫిరంగి కాలువ ప్రస్తుతం ఆక్రమణలకు గురై ఉన్నది గతంలో ఈ కాలువ పునరుద్ధరణకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీ తరపున పాదయాత్ర చేయడం జరిగింది 2014లో రాష్ట్ర విభజన తర్వాత స్వరాష్ట్రంలో కూడా ఫిరంగి కాలువ పునరుద్ధరణకు నోచుకోలేకపోయింది సంబంధిత అధికారులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వడం జరిగింది వీటిపై ఇంతవరకు ఎలాంటి పురోగతి చర్యలు చేపట్టలేకపోయారు గతంలో కేసీఆర్ ను మహబూబ్ నగర్ ఎంపీగా 2009లో టిడిపి పార్టీ మద్దతుతో గెలిపించిన తర్వాత లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టును నిర్మిస్తానని కెసిఆర్ చెప్పిన అది మాటలకే పరిమితమైందని, ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కూడా లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తే కొత్తగా నీటిపారుదలకు భూసేకరణ అవసరం ఉండదని ఫిరంగి కాలువను పునరుద్ధరిస్తే ఆ కాలువ గ్రావిటీ ద్వారా నేరుగా అందించే అవకాశం ఉంటుంది. ఫిరంగి కాలువకు సంబంధించి హైడ్రా పరిధి ఉన్నంత వరకు ఫిరంగి కాలువలో ఆక్రమణలు తొలగించి పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథన్ కు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు తెలియజేశారు.

అలాగే ఉప్పల్ చెరువుకు సంబంధించి ఆక్రమణలను హైడ్రా కమీషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఫిరంగి కాలువపై హైడ్రా కమిషనర్ స్పందనను బట్టి తదుపరి కార్యాచరణ చేపట్టాలని టిడిపి నేతలు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ కన్వీనర్ కందికంటి అశోక్ కుమార్ గౌడ్, కాణిపాకం దేవస్థానం పాలకమండలి సభ్యులు బీసీ సెల్ రాష్ట్ర పార్టీ



మాజీ అధ్యక్షుడు శ్రీపతి సతీష్, ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పొలంపల్లి అశోక్, టిడిపి రాష్ట్ర పార్టీ మాజీ కార్య నిర్వహణ కార్యదర్శి ముత్తినేని సైదేశ్వర రావు, షాద్నగర్ టిడిపి సీనియర్ నేత కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఒడిశా-హైదరాబాద్ గంజాయి సరఫరా నెట్‌వర్క్ భగ్నం

## ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్టు.. 23.02 కిలోల గంజాయి,రెండు వాహనాలు స్వాధీనం..

**నాగోల్,(ప్రజావినికిడి):**




నాగోల్ ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును ఎస్ఓటీ ఎల్బీనగర్ జోన్, నాగోల్ పోలీసులు ఛేదించారు. ఇద్దరు గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి 23.02 కిలోల గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లు, గంజాయి రవాణాకు ఉపయోగించిన రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.11.51 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

నాగోల్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 504/2026లో ఎన్‌డీపీఎస్ చట్టం-1985లోని సెక్షన్ 8(C), 20(ఎ)(ii)(C) కింద కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం..ఈ నెల 11న ఒడిశా నుంచి హైదరాబాద్‌కు రెండు వాహనాల్లో గంజాయి తరలిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం ఎస్ఓటీ ఎల్బీనగర్ జోన్ బృందానికి అందింది. దీంతో నాగోలు పోలీసులతో కలిసి నాగోల్ ఎక్స్‌రోడ్ సమీపంలోని భారత్ పెట్రోల్ పంప్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన AP31AJ3312 నంబర్ గల టయోటా ఇన్నోవా, OD05AX5899 నంబర్ గల మహీంద్రా XUV300 వాహనాలను పోలీసులు అడ్డుకుని తనిఖీ చేశారు. ఇన్నోవా డిక్కీలో నాలుగు ప్యాకెట్లు, ఎక్స్‌యూవీ 300 డిక్కీలో రెండు ప్యాకెట్లలో దాచిన గంజాయిని గుర్తించారు. మొత్తం 23.02 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

అరెస్టయిన వారిని ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన త్రినాథ్ నిరికె (40), సోనా హుంతల్ (28)గా గుర్తించారు. ఇద్దరూ డ్రైవర్లుగా పనిచేస్తున్నారని పోలీసులు తెలిపారు. వీరు స్నేహితులని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా గంజాయి రవాణాకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు. కోరాపుట్ జిల్లా లాంప్తాపూర్ తహసీల్ పరిధిలోని మల్లిపాడ గ్రామానికి చెందిన 'కమ్ము' అనే వ్యక్తి సూచనల మేరకు గంజాయిని ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తీసుకువచ్చినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లోని వినియోగదారులకు గంజాయిని విక్రయించేందుకు నిందితులు రెండు వాహనాల్లో రహస్యంగా ప్యాకెట్లను తరలించినట్లు విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో పరారీలో ఉన్న 'కమ్ము' కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గంజాయి సరఫరా చైన్‌లో ఉన్న ఇతర వ్యక్తులను గుర్తించి అరెస్టు చేసేందుకు దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల సరఫరా వ్యవస్థను పూర్తిస్థాయిలో అడ్డుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విక్రేతలు, వినియోగదారులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని కోరారు.

ఈ ఆపరేషన్ మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి (ఐపీఎస్) ప్రత్యక్ష పర్యవేక్షణలో, ఎల్బీనగర్ జోన్ డీసీపీ బి. అనురాధ (ఐపీఎస్), ఎస్ఓటీ డీసీపీ కె. మనోహర్, ఎస్ఓటీ ఎల్బీనగర్ జోన్ అదనపు డీసీపీ ఎండీ షాకీర్ హుస్సేన్, నాగోల్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ, ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్ ఇన్‌స్పెక్టర్ కె. ప్రతాప్ రెడ్డితో పాటు ఎస్ఓటీ, సరూర్‌నగర్ పోలీసు సిబ్బంది సహకారంతో విజయవంతంగా నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

# కల్తీ పన్నీర్‌పై అధికారి 'కావ్య' మౌనం ఎందుకు.?

**కల్తీ ఆహారలపై సమాచారం ఇచ్చినా స్పందన లేదు..**

**అక్కడికి వెళ్లినా అంతా సక్రమమేనా.?**

**ఆటో ట్రాలీలో పన్నీర్ ప్యాకింగ్ చేయడమేంటి తప్పు కాదా.?**

**ఫుడ్ ఇన్స్పెక్టర్ల బాధ్యతారాహిత్యం పై**

**కమిషనర్ చర్యలు తీసుకునేనా.?**

**ఫుడ్ ఇన్స్పెక్టర్ల నిర్లక్ష్యంతోనే నగరంలో కల్తీ ఆహార పదార్థాల జోరు..**



ఆటోలో పన్నీర్ ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం




**హైదరాబాద్,(ప్రజావినికిడి):** రోజులు మారుతున్నాయి, చట్టాలు కఠినమవుతున్నాయి,కల్తీ ఆహారంపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపుతున్నామని చెబుతోంది. అయిన నగరంలో కల్తీ పన్నీర్ దందా మాత్రం రోజురోజుకూ మరింత విస్తరిస్తుందన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఒకవైపు నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ కల్తీ ఆహార పదార్థాలపై కఠిన చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో మరోవైపు ఫుడ్ ఇన్స్పెక్టర్ లు, ఆహార భద్రత అధికారుల వ్యవహారంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్న కల్తీ ఆహార సరఫరాల వ్యవహారాలపై సమాచారం అందించినా ఫుడ్ ఇన్స్పెక్టర్ లలో కనీస స్పందన లేకపోవడం ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చర్చనీయాంశంగా మారింది.

### ఫోన్ చేసినా స్పందించని అధికారి..

ఉప్పల్ సర్కిల్ పరిధిలోహబ్సిగూడ స్ట్రీట్ నంబర్-8లో ఆటో ట్రాలీలో పన్నీర్ ప్యాకింగ్ చేస్తున్నారన్న సమాచారం అందడంతో రిపోర్టర్లు సంబంధిత పోలీసు అధికారులకు, ఫుడ్ ఇన్స్పెక్టర్ కావ్యను సంప్రదించేందుకు పలుమార్లు ప్రయత్నాలు చేసినారు. అయితే ఫుడ్ ఇన్స్పెక్టర్ మాత్రం ఫోన్‌కు స్పందించలేదని గతంలో కూడా ఎన్నిసార్లు ఫోన్ చేసిన అసలు ఫోన్ ఎత్తరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అత్యవసర సమాచారం అధికారికి అందితే..ఒక బాధ్యత గల అధికారిగా వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ ఫోన్‌కే స్పందించకపోవడం బాధ్యతారాహిత్యమా.? నిర్లక్ష్యమా.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ఆటోలో ప్యాకింగ్.. నిబంధనలు ఎక్కడ.?

హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8 కి చేరుకున్న తర్వాత పన్నీర్ ప్యాకింగ్ ప్రక్రియను పరిశీలించినప్పటికీ అన్నీ సక్రమంగానే ఉన్నాయని అధికారి చెప్పినట్లు సమాచారం. అయితే ప్యాకెట్లపై బ్యాచ్ నంబర్,తయారీ తేదీ,గడువు తేదీ,బరువు వంటి కీలక వివరాలు ప్రింట్ చేయలేదని పేర్కొంటున్నారు. ఆహార పదార్థాలను విక్రయించే ముందు వినియోగదారులకు అవసరమైన సమాచారాన్ని అందించడం అత్యంత కీలకం. అలాంటప్పుడు ప్యాకేజింగ్ విధానం, లేబులింగ్, పరిశుభ్రత, తయారీ ప్రదేశం తదితర అంశాలపై సమగ్ర తనిఖీ జరిగిందా.? ఆటోలో పన్నీర్ ప్యాకింగ్ చేయవచ్చా దీనిపై ఇప్పుడు ఇన్స్పెక్టర్ తనిఖీలు చేశారు.? అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

### 'ఓకే' అనడం వెనుక అసలు కారణమేంటి.?

ఆహార భద్రత నిబంధనల ఉల్లంఘన ఏమీ లేకపోతే..తనిఖీ సమయంలో ప్యాకింగ్ ప్రక్రియ, పన్నీర్ తయారీకి ఉపయోగిస్తున్న ముడి పదార్థాలు, నిల్వ విధానం, ప్యాకేజింగ్ వివరాలు, లేబులింగ్ తదితర అంశాలను ఫుడ్ ఇన్స్పెక్టర్, పోలీసు అధికారులు స్పష్టంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది. అయితే స్ట్రీట్ నెంబర్ 8లో ఆటోలో ప్యాకింగ్ చేసే పన్నీరుకు ఇవన్నీ లేకున్నా ఫుడ్ ఇన్స్పెక్టర్ ఎలా ఓకే చెప్పారు.పూర్తి సరుకును మార్కెట్లోకి ఎలా పంపారు అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.ఇవన్నీ లేకున్నా ఆ ఆటోలో సరుకును వదిలిపెట్టడం వెనుక అంతర్యం ఏమిటి.? క్షేత్రస్థాయిలో జరిగిన అధికారుల వ్యవహారంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క రూపాయి విలువచేసే చాక్లెట్ కే కవర్ పైన బ్యాచ్ నెంబర్,తయారు తేదీ,ఎక్స్పైరి తేదీ,బరువు వంటి ఇతర సమాచారం ఉంటుంది. సాధారణ ప్రజలకు వీటిపై అవగాహన ఉంది కానీ ప్రభుత్వ ఉద్యోగులైన అధికారులకు కనీస నిబంధనలను కూడా గుర్తించలేదా.? మరి గుర్తించి కావాలనే వదిలివేసారా.? ఇందులో అంతర్యం ఏమిటి.? అన్నదానిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని బాధితులు కోరుతున్నారు. వీడియోలు, ఫోటోలు ఉన్న తర్వాత కూడాఅధికారులు అన్నీ సక్రమంగా ఉన్నాయని చెప్పిన పరిస్థితుల్లో ఆ నిర్ణయానికి ఆధారాలేమిటి.?
నమూనాలు సేకరించారా.? ప్రయోగశాల పరీక్షలకు పంపారా.? కంపెనీ నుంచి వచ్చిన బిల్లు ఉందా పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలించారా.? అన్న ప్రశ్నలకు ఫుడ్ ఇన్స్పెక్టర్, పోలీసు అధికారుల నుండి సమాధానాలు రావాల్సి ఉంది.

### ఉన్నతాధికారుల మౌనం ఎందుకు.?

కల్తీ ఆహారంపై సమాచారం ఇచ్చినప్పుడు సంబంధిత అధికారులు స్పందించకపోతే క్షేత్రస్థాయిలో తనిఖీలు ఎలా జరుగుతాయి.? ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశంలో ఫుడ్ ఇన్స్పెక్టర్ అధికారుల పనితీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం లేదా.? ఇప్పుడు ఇన్స్పెక్టర్లు ఎందుకు ప్రజల ఫోన్లు ఎత్తడం లేదు. ఫోన్ ఎత్తకపోవడం వెనుక అంతర్యం ఏమిటి.? ఫోన్ ఎత్తని అధికారులపై ఉన్నత అధికారులు కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో.? అన్న చర్చ మొదలైంది. అధికారులపై వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది.

### టన్నుల కొద్దీ పన్నీర్ ఎక్కడి నుంచి వస్తోంది.?

గ్రేటర్ హైదరాబాద్‌నగరంలో విస్తృతంగా పన్నీర్ ఎలాంటి ప్యాకింగ్ లేకుండా,ఆహార భద్రత నియమాలు పాటించకుండా అందుబాటులో ఉండటంపై కూడా పలు ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పన్నీర్ తయారీకి అవసరమైన స్థాయిలో పాల ఉత్పత్తి లేకపోయినా భారీగా పన్నీర్ సరఫరా అవుతుంటే.. దాని తయారీ కేంద్రాలు ఎక్కడున్నాయి.? ముడి పదార్థాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి.? ఎవరు తయారు చేస్తున్నారు.? ఎంతకాలం నుండి తయారుచేస్తున్నారు.? ఏ మార్గంలో నగరానికి చేరుతోంది.? ఆ మార్గాలలో అధికారులు తనిఖీలు ఎందుకు చేయడం లేదు.? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు చేయించాలని బాధితులు కోరుతున్నారు.

### కల్తీపై కఠిన చర్యలు ఎక్కడ.?

కల్తీ పన్నీర్ ప్రజల ఆరోగ్యంను ఎలా దెబ్బతీస్తుంది. దానివల్ల ఎలాంటి వ్యాధులు వస్తున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు వాటిని తినడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి అనారోగ్యాలు చేకూరుతాయి, అనుమానాస్పద ఉత్పత్తులను పరీక్షించకుండా 'సక్రమమే' అని ఫుడ్ ఇన్స్పెక్టర్లు తేల్చడం సరైన విధానమా.? అన్నది ఉన్నతాధికారులు,కమిషనర్, ప్రభుత్వం పరిశీలించాలి. మరి హబ్సిగూడ స్వీట్ నెంబర్ 8లో ఫుడ్ ఇన్స్పెక్టర్ కావ్య ఎందుకు చర్యలు తీసుకోలేదు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన ఆహార భద్రత విషయంలో ఏ చిన్న నిర్లక్ష్యాన్నీ తేలికగా తీసుకోకూడదు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం చాలా సీరియస్ గా ఉన్నారు.

### కమిషనర్ చర్యలు తీసుకునేనా.?

కల్తీ పన్నీర్ వ్యవహారంపై వస్తున్న ఆరోపణలు, ఫుడ్ ఇన్స్పెక్టర్ స్పందనపై ఉన్న ప్రశ్నలు,ఆటోలో ప్యాకింగ్, లేబులింగ్ లోపాలపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు. బాధ్యులు ఎవరైనా సరే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నిజానిజాలు తేల్చేందుకు ఫుడ్ ఇన్స్పెక్టర్లు, విజిలెన్స్ అధికారులు తనిఖీ రికార్డులు, నమూనా పరీక్షలు, ప్యాకేజింగ్ వివరాలు, సరఫరా మార్గాలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలి.ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన మున్సిపల్ వ్యవస్థపైనే ప్రజలకు అనుమానం కలిగే పరిస్థితి రాకుండా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాల్సిన సమయం ఉందని ప్రజలు కోరుతున్నారు

# మధుర సంగీతమై.. మనసులు గెలిచిన గీతమై..

**శ్రీ సరస్వతీ కళా పీఠం స్వరరాగ గంగా ప్రవాహం..**

**రోజా మధిర శ్రీకారం..**

**వర్ధమాన గాయకులకు అవకాశం..**

**తెలుగు రాష్ట్రాల నలుమూలల కార్యక్రమాలు..**

**అభిమానులకు కానుకగా ఆపాత మధురాలు..**

**పాటలతో అలరిస్తున్న వర్ధమాన గాయనీ, గాయకులు..**

**హలో వైజాగ్.. సూపర్ సక్సెస్..**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
అద్భుతమైన రచన..అందుకు తగ్గ స్వర రచన.. మనసుపెట్టి పాడే గాయనీ గాయకుల ప్రతిభతో పాట ప్రాణం పోసుకుంటుంది.. అది దశాబ్దాలు గడిచిన జనహృదయాలలో శాశ్వత స్థానాన్ని పొందుతుంది.. అలా 50వ దశకం నుంచి నేటిదాకా అలరిస్తూ వస్తున్న పాటలు ఎన్నో.. వీటికి ఫిదా అయిపోయే నాటి నేటి తరాల అభిమానులు ఎందరో.. వారందరినీ ఒక వేదిక మీదకు తెచ్చి అద్భుతమైన పాటలను వారికి కానుకగా అందించి అలరింప చేయడంలో శ్రీ సరస్వతి కళా పీఠం దూసుకుపోతుంది.పరవాలేదు.. బాగా పాడుతున్నారు.అనే స్థాయి నుంచి లేచి నిలబడి కరతాల ధ్వనులతో అభినందించే స్థాయికి ఎదిగింది.వైజాగ్ పౌర గ్రంథాలయంలో రాత్రి 9 గంటల వరకు ప్రేక్షకులను కట్టిపడేసి వారిని మంత్రముగ్ధులను చేసిన ఏకైక సంస్థ శ్రీ సరస్వతి కళా పీఠం అని స్థానికులే సభలో చెప్పడం విశేషం. హైదరాబాద్ రవీంద్ర భారతికి మించి మీ కార్యక్రమం కొనసాగింది అంటూ వైజాగ్ వాసులు చేసిన కామెంట్ సరస్వతి కళా పీఠానికి ఒక మైలురాయి వంటిదే.
హైదరాబాదు - విశాఖపట్నం కేంద్రాలుగా ఇప్పటిదాకా ఆయా ప్రాంతాలలోనే కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చిన శ్రీ సరస్వతి కళా పీఠం తాజాగా వైజాగ్ వేదికగా సంగీత విభావరిని నిర్వహించి అక్కడి ప్రేక్షక లోకాల చేత చప్పట్లు కొట్టించుకుంది. ఇంతింతై వటుడింతై..అన్నట్లుగా సుమధుర గాన ప్రపంచంలో అంచలంచలుగా ఎదుగుతున్న శ్రీ సరస్వతి కళా పీఠం ఆవిష్కరణ నుంచి నేటిదాకా వేస్తున్న అడుగులను ఒక్కసారి పరిశీలిస్తే..

### వన్ ఉమెన్ ఆర్మీ.. "రోజా మధిర" ..

శ్రీ సరస్వతి కళాపీఠం ఆవిష్కరణకు తొలి అడుగులకు అన్నీ తానై ముందుకు నడిచి వన్ ఉమెన్ ఆర్మీగా కనిపించే నాయకురాలు ఈల పాట గాయని, జీనియస్ బుక్ ఆఫ్ వరల్డ్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ గ్రహీత రోజా మధిర. ఆమె భర్త ఎంవీజీవి రావు సహకారం, అదేవిధంగా ఈ సంస్థకు వెన్ను దన్నుగా నిలిచిన గాయని మనుల సుశీలమ్మ జాతీయ అవార్డు గ్రహీత కొమ్మినేని రత్నకుమారి, శోభన్ బాబు మేనకోడలు రమణి హరితో ప్రారంభమైన శ్రీ సరస్వతి కళా పీఠంలో వర్ధమాన




గాయకులను, పాడాలని ఉత్సాహం ఉన్న వారిని ప్రోత్సహించి మంచి మంచి పాటలను ఎంపిక చేసి వారితో పాడిస్తూ క్రమంగా అభిమానులను సంపాదించుకున్నారు.ఈ క్రమంలోనే గాన ప్రపంచంలోకి అడుగు పెట్టాలని ఆసక్తి ఉన్న జర్నలిస్టు కేపీ, విష్ణు ప్రియ, చిన్నారి, శరణ్యక్షిత, మనస్విని,అక్షర, యాదగిరి,క్రాంతి లాంటి గాయకులు కూడా ముందుకు వచ్చి పాడుతుండడం విశేషం.
ఇప్పుడు వీరికి తోడుగా హనుమంతరావు,రత్నకుమారి, నీలిమ లాంటి సీనియర్ గాయని గాయకులు సరస్వతి కళాపీఠంలో వర్ధమాన గాయని గాయకులకు అండగా నిలిచారు.వారి అనుభవాన్ని వారి గాన చాతుర్యాన్ని మరో తరానికి అందిస్తున్నారు. ఎలాంటి ప్రతిఫలాలు ఆశించకుండా కేవలం పాట మీద ఉన్న ప్రేమతో వీళ్లంతా ముందుకు వచ్చి ఆర్థికంగా భరించి ఎవరి వద్ద విరాళాలు సేకరించకుండా జనరంజకమైన పాటలతో అలరిస్తుండడం ప్రత్యేకం.

### ఆపాత మధురాలే వనరులు..

కొత్త కొత్త పాటలు ఏ తరానికి సంబంధించి ఆ తరంలో మారుమోగుతూనే ఉంటాయి. కానీ పాత పాటలు,వాటిలో ఉన్న మాధుర్యం, అందమైన సాహిత్యం నేటి తరాలకు తెలియజెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే సరస్వతి కళాపీఠం లక్ష్యం. అందుకే ఎన్టీఆర్, ఏఎన్ఆర్,కృష్ణ, శోభన్ బాబు, కృష్ణంరాజు, మురళీమోహన్, చంద్రమోహన్, రంగనాథ్, కాంతారావు, చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ లాంటి ఆనాటి హీరోల పాటలు ఆనాటి సముద్రాల మొదలుకొని తర్వాత కాలంలో వచ్చిన శ్రీశ్రీ, డాక్టర్ సి నారాయణరెడ్డి, కృష్ణశాస్త్రి, ఆరుద్ర, ఆత్రేయ, వేటూరి, సీతారామశాస్త్రి లాంటి కవులు రాసిన పాటల వరకు పాడుతూ అద్భుతమైన సంగీత దర్శకులు ఎందరో రూపొందించిన పాటలను నేటి తరాలకు అందిస్తూ వస్తుంది. ఎప్పుడో 60 దశకంలో జగదేకవీరుని కథ సినిమాలో వచ్చిన శివ శంకరి అనే పాటను ఈలపాటలో రోజా మధిర పాడితే నాటి నేటి తరాలు కూడా లేచి నిలబడి చప్పట్లు కొట్టారంటే ఆ పాటల గొప్పతనాన్ని అర్థం చేసుకోవచ్చు.82 లో వచ్చిన




సాగరసంగమంలోని వేదం అనువణువున నాదం..అనే పాటను సీనియర్ నాయకులు హనుమంతరావునేటితరం పదేళ్ల చిన్నారి అక్షర ఆలపిస్తే ముగ్ధులైపోయి ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లు కొట్టడం విశేషం. అలాగే చిన్నారి అక్షరతో రాణివో రాణి అంటూ అల్లు రామలింగయ్యను అనుకరిస్తూ చిన్నారి అక్షరతో జర్నలిస్టు కేపీ పాడితే హాలంతా ఈలలతో మారుమోగింది. ఇలా వర్ధమాన గాయకులు శ్రీ సరస్వతి కళాపీఠం సహకారంతో తమ సత్తాను ప్రదర్శిస్తూ పాటల పరంగా రోజురోజుకు తమ పరిణితిని పెంచుకుంటున్నారు. అభిమానులను కూడా పెంచుకుంటున్నారు.ఏది ఏమైనా శ్రీ సరస్వతి కళాపీఠం వర్ధమాన గాయకులకు ఒక వరం అనే చెప్పాలి. హలో వైజాగ్ కార్యక్రమంతో శ్రీ సరస్వతి కళా పీఠం ఇమేజ్ ఎక్కడికో వెళ్ళింది. దేశంలోని అనేక కీలక నగరాల్లో ఇలాంటి కార్యక్రమాలు తెలుగువారి కోసం మరిన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని కళాభిమానులు కోరుతున్నారు




# షాద్ నగర్ లో ఘనంగా ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భవ దినోత్సవం వేడుకలు

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఏఐఎస్ఎఫ్ (91)వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాశ్ నాయక్ ఆధ్వర్యంలో షాద్ నగర్ పట్టణంలోని వీఐఐటి జేఈఈ అకాడమీ జూనియర్ కాలేజ్ లో ఘనంగా జండా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ ఒక్క జెండా పండుగ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం పవన్ చౌహాన్ పాల్గొని జెండాను ఎగరవేసి అనంతరం మాట్లాడుతూ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం అనేది 1936 ఆగస్టు 12న ఉత్తర్ ప్రదేశ్ రాజధాని లోని లక్నో నగరం బెనారస్ విశ్వవిద్యాలయంలో స్వతంత్ర ఉద్యమంలో విద్యార్థులు ఉద్యమించినప్పటికీ దేశవ్యాప్తంగా జాతీయస్థాయిలో విద్యార్థి సంఘం అవసరమని భావించి ఉత్తరప్రదేశ్ డిగ్రీ విద్యార్థులు ప్రేమ నారాయణ, భార్గవ్,బాబురుద్దీన్ లు కలిసి విద్యార్థి సంఘాన్ని స్థాపించారు. నాటి నుండి నేటి వరకు విద్యార్థుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తూ 90 సంవత్సరాలు పూర్తి చేసుకుని 91వ సంవత్సరంలో అడుగుపెడుతున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ నాడు స్వతంత్ర ఉద్యమంలో నేడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం చేసిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ప్రస్తావించారు విద్యార్థులందరూ ఏఐఎస్ఎఫ్ జెండా నీడన విద్యార్థుల హక్కులకై పోరాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు అరటి పండ్లు పంపిణీ చేశారు.ఈ యొక్క కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్,హర్షిత్,సంతోష్ విద్యార్థి విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.




# ఏజెన్సీలో మిర్చి ఎవిటి బాండ్లు ఇవ్వడం చట్టాన్ని వెతిరేకం

**వాజేడు, ఆగస్టు 13(ప్రజావినికిడి)**
కృష్ణాపురం, కడెకల,అలాగే టేకులగూడెం లాంటి పూర్తిగా ఆదివాసీలు ఉన్న గ్రామాలను విస్మరించి,ఐదో షెడ్యూల్డ్ ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తూ గిరిజనేతరుల గ్రామాలకు మిర్చి ఎవిటి. బాండ్లు ఇవ్వడాన్ని ఆదివాసీ నవనిర్మాణ సేన వాజేడు మండల అధ్యక్షులు మోడెం. నాగరాజు తీవ్రంగా వ్యతిరేకించారు.
నిర్దిష్టంగా ఈ గ్రామాల్లో జరిగిన అన్యాయంపై ఎఎన్ఎస్. మండల అధ్యక్షుడు లేవనెత్తిన ముఖ్యమైన అంశాలు:ఆదివాసీ గ్రామాలకు జరిగిన అన్యాయంఅర్హులైన రైతుల నిర్లక్ష్యం కృష్ణాపురం, కడెకల, టేకులగూడెం గ్రామాల్లో వందలాది ఆదివాసీ కుటుంబాలు మిర్చి సాగుపై ఆధారపడి బతుకుతున్నాయి.అలాంటి వారికి మద్దతుగా నిలవాల్సిన ఎవిటి. మిర్చి బాండ్లను పక్కన పెట్టడం అన్యాయం.
చట్టాల ఉల్లంఘన ఐదో షెడ్యూల్డ్ ఏజెన్సీ పరిధిలోని ఈ గ్రామాల్లోని వనరులు,కంపెనీ ఒప్పందాలు, రాయితీలపై మొదటి హక్కు స్థానిక గిరిజనులదే.కానీ ఎవిటి. ప్రతినిధులు లేదా స్థానిక అధికారులు గిరిజనేతరులకు ప్రాధాన్యత ఇచ్చి చట్టాన్ని ఉల్లంఘించారని ఎఎన్ఎస్. ఆరోపించింది.ఆర్థిక దోపిడీ ఈ చర్య వల్ల కృష్ణాపురం, కడెకల, టేకులగూడెం గ్రామాల ఆదివాసీ రైతులు కంపెనీల నుండి వచ్చే రాయితీలు, లాభదాయకమైన కొనుగోలు ఒప్పందాలను కోల్పోయి ఆర్థికంగా నష్టపోతున్నారు.ఎఎన్ఎస్. డిమాండ్లు & తదుపరి కార్యాచరణక్షేత్రస్థాయి విచారణ అధికారులు వెంటనే కృష్ణాపురం, కడెకల, టేకులగూడెం గ్రామాల్లో పర్యటించి అర్హులైన గిరిజన రైతుల వివరాలను సేకరించాలి.బాండ్ల పునరుద్ధరణ ఏవీటి.మిర్చి బాండును వాటిని తక్షణమే ఈ మూడు గ్రామాల ఆదివాసీ రైతులకు అందజేయాలి. ఈ వివక్షను ఇలాగే కొనసాగిస్తే ఐటీడీఏ కార్యాలయం ముట్టడితో పాటు వాజేడు మండల కేంద్రంలో పెద్ద ఎత్తున గిరిజన ఉద్యమాన్ని చేపడతామని ఎఎన్ఎస్ హెచ్చరించింది.




ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# డీ లిమిటేషన్‌తో ప్రజలకు ఒరిగేదేమీ లేదు !

**ఆగష్టు 12,(ప్రజావినికిడి):** కాలనుగుణంగా నడుచుకోవడం..ప్రజల ఆకాంక్షలను పట్టించుకోవిడం పాలకుల కర్తవ్యం. శ్రీరాముడంతటి వాడు ప్రజల మనసెరిగి పాలన చేశారు. పూర్వం రాజులంతా అలాగే నడుచుకునే వారు. అలాకాకుండా పీడించిన వారు చరిత్రలో కనుమరుగయ్యారు. నిరంకుశంగా పాలించిన వారు సైతం చరిత్ర లేకుండా పోయారు. భారతదేశంలో అనేకానేక సమస్యలు ఇప్పుడు వస్తున్నాయి. వాటిని పట్టించుకోవడం మానేసిన అధికార, విపక్ష సభ్యులు తమ మానాన తాము సాగుతున్నారు. ఈ మధ్యకాలంలో పార్లమెంట్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలేవీ పెద్దగా చర్చించడం లేదు. పాలకులు అనుకున్నది మాత్రమే చట్టంగా మారుతోంది. దానిపైనా చర్చలు లేవు. విపక్షాలు కూడా గందరగోళం సృష్టించి బయపటడడం ద్వారా రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నాయి. ఈ క్రమంలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నీరుగారి పోయాయి. ఎవరి పట్టు వారు పట్టడంతో రోజూ సభలను వాయిదా వేయడం మినహా ముందుకు కదలడం లేదు. జంతర్‌మంతర్ ఘటనకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా వచ్చి క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేయడంతో పార్లమెంటు ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగడమే లేదు. మరో వైపు పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసుకుని రావడం, స్పీకర్ ఓంబిర్లా




వారించడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింపచేస్తున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. ఇండియా కూటమి భాగస్వామి జార్ఖండ్ ముక్తి మోర్చా అధికారంలో ఉన్న జార్ఖండ్‌లో విద్యార్థులపై జరిగిన లాఠీ ఛార్జీతో అధికార పార్టీ సభ్యులకు అవకాశం లభించింది. అందుకే జార్ఖండ్‌పై జవాబ్‌దో అంటూ ఎదురుదాడికి దిగారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయనడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల తీరును పత్రికలు, ఛానళ్లు కవర్ చేస్తూ...తమవంతు బాధ్యతను నిర్వహి స్తున్నాయి. నిజానికి వర్షాకాల సమావేశాల్లో ఏవో అద్భుతాలు జరుగుతాయనుకున్నారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు, ఎఫ్‌సీఆర్ఐ బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అనుసంధాన్ బిల్లు మొదలైన వాటిని ఆమోదం పొందేలా మోడీ వ్యూహం సిద్ధం చేసుకున్నారని అంతా భావించారు. నిజానికి ఈ బిల్లులను ఆమోదింపచేసేందుకు నరేంద్రమోదీ బృందం రంగం సిద్ధం చేసింది. బెంగాల్‌లో విజయం తర్వాత రెట్టించిన ఉత్సాహంతో తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలను చీల్చి ఒక అనామక పార్టీలో చేరేలా చేశారు. ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన ఎంపీలను తమ వైపుకు లాగారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులను బీజేపీ వైపునకు తిప్పుకున్నారు. తమిళనాడులో విజయ్ పార్టీకి కాంగ్రెస్ మద్దతునిచ్చిన తర్వాత ఇండియా కూటమినుంచి వైదొలగిన డీఎంకేతో బేరసారాలు ఆడారు. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీతో కూడా మంతనాలు జరిపారు. ఏ పార్టీనైనా ఎప్పుడైనా చీల్చగల, ఎవరినైనా దెబ్బతీయగల నరేంద్రమోదీ ఏదైనా సాధించగలరని ఎన్‌డిఎ మద్దతుదారులంతా భావించారు. కానీ ఇలా తలకిందులు అవుతుదని వారు కూడా భావించి ఉండరు. బహుశా మోడీ కూడా ఇలా జరుగుతుందని ఊహించి ఉండరు. అంతా తాను అనుకున్నట్లుగా సజావుగా సాగిపోతుందని అనుకుని ఉంటారు. నిజానికి పార్లమెంట్ ప్రారంభం రోజే మోడీ సభకు హాజరై ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. కాక్రోచ్ పార్టీ ఉద్యమంతో అంతా తలకిందులయ్యింది. ముఖ్యంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం, విద్యార్థుల ఆందోళన, మోదీని అవహేళన చేయడం, ఆయన ప్రతి చర్యనూ ప్రశ్నించడం వంటివన్నీ మోదీ నాయకత్వాన్ని నిలదీస్తూ వచ్చాయి. ఆందోళన ఫలితంగా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి రావడం కూడా ఓ రకంగా ఎదురుదెబ్బగానే భావించాలి. ఢిల్లీలో విద్యార్థుల నిరసన దేశ వ్యాప్తంగా అనేక నగరాల్లో ప్రకంపనలు సృష్టించడంతో బీజేపీ, సంఘ్‌ను పునరాలోచనలో పడేలా చేశాయనడంలో సందేహం లేదు. ఇప్పుడు దాని ప్రభావంతోనే జార్ఖండ్‌లోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది. అయితే దీనివెనక ఎవరి హస్తం ఉందన్న ఆరా తీస్తూనే ఉన్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే పాలకులు ప్రజల మనసెరిగి ప్రవర్తించాలి. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా సాగాలి. ఇప్పటికైనా విద్యార్థుల ఆందోళనలను సానుకూల దృక్పంథంతో పరిశీలిస్తే, సమస్యను పరిష్కరిస్తే మంచిది. ఇదొక్కటే కాదు.. అనేక సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలి. నిరుద్యోగం, వైద్యరంగం, అధిక ధరలు, వంటివాటిని యుద్ధప్రాతిపదిక పరిష్కరించాలి. డీ లిమిటేషన్ ప్రజలకు అవసరం లేని వ్యవహారం. ఇది కేవలం రాజకీయ పార్టీలకు సంబంధించినదే కనుక దీనిని పక్కన పెట్టడం మంచిది. మహిళా బిల్లును ప్రస్తు పార్లమెంట్ సభ్యుల సంఖ్యకే పరిమితం చేయడం మంచిది. ఎంపిలు పెరిగితే ఆర్థిక భారం తప్ప ప్రజలకు ఒరిగేదేమీ లేదు. ఈ దిశగా కృషి చేయకుంటే మోడీ సర్కార్‌కు కష్టాలు తప్పవు. దేశలో పెరుగుతన్న నిరుద్యోగ సమస్యలతో పాటు, అధిక ధరలు, దోపిడీలు, సైబర్ మోసాలు వంటివన్నీ పరిస్కరించదగ్గ సమస్యలే. కనుక వీటిపై మోడీ సర్కార్ దృష్టి సారిస్తే ప్రజలు ఆదరిస్తారు.

# మహిళా బిల్లు ముద్దు..డీలిమిటేషన్ వద్దు

**ప్రస్తుత సంఖ్య ఆధారంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు -తమిళనాడు అసెంబ్లీలో సిఎం విజయ్ తీర్మానం**

**చెన్నై,ఆగష్టు 12,(ప్రజావినికిడి):** అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా తమిళనాడు ప్రభుత్వం వరుస తీర్మానాలను ప్రవేశపెడుతోంది. మొన్న రాష్ట్రగీతం, నిన్న నీట్.. నేడు డీలిమిటేషన్‌పై తీర్మానాలను తీసుకువచ్చింది.

లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన డీలిమిటేషన్ కు వ్యతిరేకంగా తమిళనాడు సీఎం విజయ్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. డీలిమిటేషన్‌కు తాము అంగీకరించేదే లేదని స్పష్టం చేశారు. జనాభా నియంత్రణకు అనేక చర్యలు తీసుకున్న తమిళనాడుకు డీలిమిటేషన్‌తో నష్టం జరుగు తుందని అన్నారు. జనాభా ఆధారంగా నియోజకవర్గ పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలన్నిటికీ నష్టమని చెప్పారు. ఈ తీర్మానంలో సీఎం విజయ్ మొత్తం మూడు డిమాండ్స్‌ను కేంద్రం ముందుంచారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను ఎప్పటికీ 543 వద్ద స్తంభింపజేయాలని అన్నారు. రాష్ట్రాలకు ప్రస్తుతమున్న ఎంపీ సీట్ల సంఖ్యను శాశ్వతం చేయాలని అన్నారు. రాష్ట్రాల అసెంబ్లీల్లో కూడా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తీసుకురావాలని అన్నారు. నియోజకర్గాల పునర్ వ్యవస్థీకరణ కోసం కేంద్రం



తీసుకువచ్చిన బిల్లును వ్యతిరేకించింది. అదే సమయంలో మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇచ్చింది. ప్రస్తుతమున్న 543 సీట్లతోనే దానిని అమలు చేయాలని విజయ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేశాయని ఈ సందర్భంగా సీఎం విజయ్ అన్నారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే నష్టం వాటిల్లొచ్చని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను అలాగే కొనసాగించాలి. ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం కేటాయించిన స్థానాలను శాశ్వతం చేయాలి. రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్రం ముందు మూడు

డిమాండ్లు ఉంచారు. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లను 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే కల్పించడానికి పార్లమెంటు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రయత్నిస్తోంది. 543 లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించి 816కి పెంచే ప్రతిపాదనపైనా అడుగు ముందుకు వేయాలని చూస్తోంది. ఈ సమయంలో తమిళనాడు ప్రభుత్వం తీర్మానాన్ని ప్రవేశపెట్టడం గమనార్హం. ఇటీవల పశ్చిమబెంగాల్, మహారాష్ట్రల్లో రాజకీయ సమీకరణాల మార్పులతో ఎన్డీయే బలం మరింత పెరిగిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. దీంతో, కేంద్రం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లును తెచ్చేందుకు మరోసారి ప్రయత్నిస్తుందన్న వార్తలు వచ్చాయి. అయితే, డీలిమిటేషన్‌ను దక్షిణాది రాష్ట్రాలు మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు సీఎం విజయ్ ప్రవేశపెట్టిన తీర్మానం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

# తిరుమలకు వచ్చే విదేశీ భక్తులకు ప్రభుత్వం శుభవార్త

**రేణిగుంట విమానాశ్రయంలో ఈ వీసా సేవలు**

**తిరుపతి,ఆగష్టు 12,(ప్రజావినికిడి):** తిరుమలలో కొలువుదీరిన కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి వారి దర్శనం కోసం వచ్చే విదేశీ భక్తులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. తిరుపతి సమీపంలోని రేణిగుంట విమానాశ్రయంలో ఈ - వీసా సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. గతంలో తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం విదేశీ భక్తులు రావాలంటే.. ముందుగా చెన్నై, బెంగళూరు




లేదా హైదరాబాద్ చేరుకోవాల్సి వచ్చేది. అక్కడ ఈ -వీసా పక్రియ పూర్తి చేసుకుని ఆ తర్వాత శ్రీవారి దర్శనం కోసం తిరుపతికి చేరుకునే వారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో తిరుపతి విమానాశ్రయంలో ఈ వీసా సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఇకపై ప్రయాణికులు విదేశాల నుంచి నేరుగా తిరుపతి విమానాశ్రయం చేరుకొని ఈ - వీసా పక్రియ ముగించుకునే అవకాశం ఉంటుంది. ప్రయాణానికి కనీసం పది రోజులు ముందే ఆన్‌లైన్‌లో ఈ - వీసాను ప్రయాణికులు అందుకోవాల్సి ఉంటుంది. యితే తిరుపతి విమానాశ్రయంలో అంతర్జాతీయ సర్వీసులు లేనప్పటికీ ముందస్తుగానే ఈ - వీసా కౌంటరును కేంద్ర పౌర విమానయాన శాఖ మంజూరు చేసింది. త్వరలోనే ఈ విమానాశ్రయం నుంచి ఇంటర్నేషనల్ సర్వీసులు ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం.

-----

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ,ఆగష్టు 12,(ప్రజావినికిడి):** గత రెండు రోజుల నుంచి బంగారం ధరలు పెరుగుతూ పోతున్నాయి. వరుసగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. శ్రావణమాసం కావడంతో ధరలు పెరగడంపై మహిళలు పెదవి విరుస్తున్నారు. బుధవారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 1,040 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 950 రూపాయలు..18 క్యారెట్ల బంగారంపై 770 రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 11 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,54,860 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,41,950 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,16,140 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

# నేటినుంచి శ్రావణ మాసం ప్రారంభం

**శుభ కార్యాక్రమాలకు అనువైన మాసం -అనేక పూజాది వ్రతాలకు పవిత్ర మాసం**

**యాదగిరిగుట్ట,ఆగష్టు 12,(ప్రజావినికిడి):** హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసం విశిష్టమైనదిగా భావిస్తారు. చాంద్రమానం ప్రకారం.. తెలుగు మాసాల్లో ఐదో మాసం శ్రావణ మాసం. పౌర్ణమి తిథి రోజు చంద్రుడు శ్రవణ నక్షత్రంలో ఉంటాడు కాబట్టి ఈ మాసానికి శ్రావణ మాసం అని పేరు వచ్చింది. అలాగే.. స్థితికారుడైన శ్రీ మహావిష్ణువు జన్మ నక్షత్రం కూడా శ్రావణ నక్షత్రం కాబట్టి శ్రావణ మాసం అని కూడా వచ్చిందని చెబుతారు. ఈ మాసంలో చేసే పూజలు ఎంతో విశిష్టమైనవిగా హిందు ఆచారాన్ని పాటించే వారి నమ్మకం.దేవతలకు అత్యంత ప్రీతికరమైన మాసం శ్రావణ మాసం. లక్ష్మీదేవి ఎంతో ఇష్టమైన ఈ మాసంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం దీపారాధన చేయడం వల్ల దీర్ఘసుమంగళీ ప్రాప్తంతో పాటు అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని పురాణోక్తి.. తిథులతో కూడా సంబంధం లేకుండా అష్టమి, నవమి, అమావాస్య రోజుల్లో కూడా పూజలు, పండుగలు చేసే మాసం ఈ శ్రావణ మాసం మాత్రమే. అందుకే దీన్ని అత్యంత శుభప్రదమైన మాసంగా భావిస్తారు. ఈ శ్రావణ మాసంలో శివ కేశవులను నిష్టతో, అత్యంత భక్తి శ్రద్దలతో పూజిస్తారు. శ్రావణ సోమవారం, శ్రావణ మంగళవారం, శ్రావణ శుక్రవారం, శ్రావణ శనివారం ఇలా ఈమాసంలో ప్రతి రోజూ విశిష్టతతో కూడుకున్నదే. ఈ మాసంలో చేసే పూజలు విశేషమైన ఫలితాలు ఇస్తాయని నమ్మకం. వివాహాది శుభకార్యాలకు, మంగళ గౌరీ నోములకు, వరలక్ష్మి వ్రతానికి, అన్నాచెల్లెళ్ల బంధాన్ని ముడివేసే రాఖీ పౌర్ణమి వంటి పండుగలకు శ్రావణ మాసం పెట్టింది పేరు. తెలుగు పంచాంగం ప్రకారం ఐదో మాసమైన శ్రావణ మాసంలో పండుగలు, వ్రతాలతో పాటు శుభకార్యాలు కూడా ఎక్కువగానే జరుగుతాయి. అందుకే శ్రావణ మాసాన్ని శుభాల మాసమని అంటారు. శుభాల మాసమైన శ్రావణ మాసంలో పౌర్ణమి నాటి చంద్రుడు శ్రవణా నక్షత్రంలో సంచరించడం వల్ల ఈ మాసానికి శ్రావణ మాసమని పేరు వచ్చింది. హిందూ సంప్రదాయం ప్రకారం శ్రావణ మాసంలో ఏ పని చేసినా శుభకరమని



భావిస్తారు. శ్రావణంలో రానున్న పుణ్య తిథులు - పండుగలు ఇలావున్నాయి. ఆగస్టు 13, గురువారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం అవుతుంది. ఆగస్టు 13, గురువారం శ్రావణ శుద్ధ పాడ్యమి: శ్రావణ మాసం ప్రారంభం

గస్టు 14, శుక్రవారం శ్రావణ శుద్ధ విదియ చంద్రోదయం, శ్రావణ మాసం మొదటి శుక్రవారం, ఆండాళ్ తిరు నక్షత్రం, ఆండాళ్ తిరుపురంగా భావిస్తారు. ఆగస్టు 15, శనివారం శ్రావణ శుద్ధ తదియ. శ్రీనివాసుడికి ఇష్టమైన రోజు. ఆగస్టు 16, ఆదివారం, శ్రావణ శుద్ధ చవితి: నాగ చతుర్థి, కశ్యప మహర్షి జయంతి కూడా.

ఆగస్టు 17, సోమవారం, శ్రావణ శుద్ధ పంచమి: నాగ పంచమి, గరుడ పంచమి, సింహ సంక్రమణం, శృంగేరి శ్రీ విధుశేఖర భారతీతీర్థ స్వామి వారి జన్మదినం, నారాయణ వనం శ్రీ వీరభద్ర స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయి. ఆగస్టు 18, మంగళవారం శ్రావణ శుద్ధ షష్టి: కల్కి జయంతి. ఆగస్టు 21, శుక్రవారం శ్రావణ శుద్ధ నవమి: శ్రీ వరలక్ష్మి వ్రతం, శ్రీ తరిగొండ వెంగమాంబ వర్ధంతి, తిరుచానూరు శ్రీ పద్మావతి తాయారు అమ్మవారి సన్నిధిలో వరలక్ష్మి వ్రతం వైభవంగా నిర్వహిస్తారు. ఆగస్టు 22, శనివారం శ్రావణ శుద్ధ దశమి: తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలకు అంకురార్పణ జరుగనుంది. ఆగస్టు 23, ఆదివారం శ్రావణ శుద్ధ ఏకాదశి: సర్వ ఏకాదశి, శ్రావణ పుత్రదా ఏకాదశి అని కూడా అంటారు. ఆగస్టు 25, మంగళవారం శ్రావణ శుద్ధ త్రయోదశి: తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలు సమాప్తి, పక్ష ప్రదోషం, భౌమ ప్రదోషం. ఆగస్టు 26, బుధవారం శ్రావణ శుద్ధ చతుర్దశి: ఓనం పండుగ, రుగ్వేదీనాం ఉపాకర్మ, నారాయణ వనం శ్రీ వీరభద్ర స్వామివారి బ్రహ్మోత్సవాలు సమాప్తి కానున్నాయి. ఆగస్టు 28, శుక్రవారం శ్రావణ శుద్ధ పౌర్ణమి: రాఖీపౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి, వైఖానస మహాముని జయంతి, హయగ్రీవ జయంతి, శ్రావణాల పౌర్ణమి, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి తిరు నక్షత్రం, మృకండ మహర్షి జయంతి కూడా. ఆగస్టు 29, శనివారం శ్రావణ బహుళ పాడ్యమి: గాయత్రీ జపాలకు మంచిది. ఆగస్టు 30, ఆదివారం శ్రావణ బహుళ విదియ: శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన దినోత్సవం. ఆగస్టు 31, సోమవారం శ్రావణ బహుళ తదియ/ చవితి: పుబ్బ కార్తె ప్రారంభం, సంకష్టహర చవితి కూడా. సెప్టెంబర్ 2, బుధవారం శ్రావణ బహుళ పంచమి/షష్టి: బలరామ జయంతి, తాళ్లపాక శ్రీ సిద్దేశ్వర స్వామివారి పవిత్రోత్సవాలు ప్రారంభం. సెప్టెంబర్ 4, శుక్రవారం శ్రావణ బహుళ అష్టమి: గోకులాష్టమి, శ్రీ కృష్ణాష్టమి, జన్మాష్టమి, తిరుమల శ్రీవారి ఆస్థానం, గోశాలలో గోపూజ, తాళ్లపాక శ్రీ సిద్దేశ్వర స్వామివారి పవిత్రోత్సవాలు సమాప్తం. సెప్టెంబర్ 5, శనివారం శ్రావణ బహుళ నవమి: గురుపూజోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవం. సెప్టెంబర్ 7, సోమవారం శ్రావణ బహుళ ఏకాదశి: సర్వ ఏకాదశి. సెప్టెంబర్ 8, మంగళవారం శ్రావణ బహుళ ద్వాదశి/ త్రయోదశి: పక్ష ప్రదోషం, భౌమ ప్రదోషం. సెప్టెంబర్ 9, బుధవారం శ్రావణ బహుళ చతుర్దశి: మాసశివరాత్రి. సెప్టెంబర్ 11, శుక్రవారం శ్రావణ బహుళ అమావాస్య: పోలాల అమావాస్య ఈ రోజుతో శ్రావణ మాసం సమాప్తమవు తుంది. శ్రావణ మాసంలో రానున్న పండుగలను శాస్త్రంలో సూచించిన విధంగా, పురాణాల ప్రకారం జరుపుకుంటే మంచిది.

--------------

# చీకుపల్లిలో 100 కేవి బేస్ పనులను పరిశీలించిన తెలంగాణ.విద్యుత్ సిఎండి



**వాజేడు,ఆగష్టు 13,(ప్రజావినికిడి):** వాజేడు మండలం చీకుపల్లి గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద టిజిఎన్పిడిసిఎల్.ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 100 కేవి సోలార్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం (బేస్ ) పనులను టిజిఎన్పిడిసి ఎల్. గౌరవనీయులైన సిఎండి.వరుణ్ రెడ్డి పర్యవేక్షించి, పనుల పురోగతిని సమీక్షించారు.అనంతరం ఎన్. వెంకటాపురం నుంచి ధర్మారం సబ్‌స్టేషన్ వరకు నిర్మిస్తున్న 33 కేవి ఇంటర్‌లింకింగ్ లైన్ పనులను అదేవిదంగా చెరుకూరు నుంచి ధర్మారం సబ్‌స్టేషన్ వరకు ఫారెస్ట్ ఏరియాలో ఉన్న పాత 33 కేవి లైన్ స్థానంలో కవర్డ్ కండక్టర్‌తో చేపట్టిన పనులను కూడా సిఎండి.పరిశీలించారు.తదనంతరం వాజేడు సెక్షన్ ఫీల్డ్ సిబ్బంది అలాగే ఎమర్జెన్సీ బ్రేక్ డౌన్ (ఈడిబి) సిబ్బందితో సిఎండి.ఇంటరాక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విధుల్లో తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని, సేఫ్టీ పరికరాలను సక్రమంగా ఉపయోగిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు.

విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా నివారిస్తూ టిజిఎన్పిడిసిఎల్ ను ప్రమాద రహిత సంస్థగా నిలపడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సిఎండి.సిబ్బందికి సూచించారు.

ఈ కార్యక్రమంలో ములుగు ఎస్ఈ.బి. బిక్షపతి,నిర్మాణం. డిఈ సదానందం, ఏటూరునాగారం డిఈ పురుషోత్తం సిఎండి,తో కలిసి పాల్గొన్నారు.

# కుల్‌దీప్‌కు తుది జట్టులో స్థిరత్వం కల్పించాలి



**• టీమిండియా**

**మాజీ స్పిన్నర్ మురళీ కార్తీక్ సూచన**

భారత స్టార్ చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ సరిగ్గా ఉపయోగించుకోవట్లేదనే ఆందోళన మాజీ క్రికెటర్లలో తీవ్రమవుతోంది. 15 మందిలో ఉంటున్నప్పటికీ అతడికి తుది జట్టులో మాత్రం ఆడే అవకాశం రావట్లేదు. ఇటీవల ఇంగ్లాండ్‌తో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లోనూ అతడు బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ముందు కుల్‌దీప్‌ను ఉద్దేశించి.. టీమిండియా మాజీ స్పిన్నర్ మురళీ కార్తిక్ కీలక వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ, ద్రవిడ్ హయాంలో కుల్‌దీప్‌ను ఒక అసలైన మ్యాచ్ విన్నర్‌గా చూస్తూ పూర్తి స్వేచ్ఛ, భరోసా ఇచ్చారని గుర్తు చేశాడు. ప్రస్తుత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సైతం అదే బాటలో ఈ స్పిన్నర్ విషయంలో అలాంటి నిర్ణయాలే తీసుకోవాలని హితవు పలికాడు. కాగా రాహుల్ ద్రవిడ్ కోచింగ్ హయాంలో (2021 నవంబర్ నుంచి 2024 జూన్ వరకు) కుల్‌దీప్ అన్ని ఫార్మాట్లలో కలిపి నెలకు సగటున 2 మ్యాచ్‌ల చొప్పున 60 మ్యాచ్‌లు ఆడాడు. అయితే గంభీర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ సగటు నెలకు 1.5 మ్యాచ్‌లకు (38 మ్యాచ్‌లు) పడిపోయింది. ముఖ్యంగా ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో కుల్‌దీప్‌ను కాదని నలుగురు పేసర్లతో బరిలోకి దిగడం అతని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు. కుల్‌దీప్ పట్ల ప్రస్తుత మేనేజ్‌మెంట్ వ్యవహరిస్తున్న తీరుపై సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా తన యూట్యూబ్ ఛానెల్‌లో బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. గంభీర్ హయాంలో బౌలింగ్ పదును కంటే బ్యాటింగ్ డెప్త్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంపై మురళీ కార్తీక్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. టెస్టు మ్యాచ్ గెలవాలంటే ప్రత్యర్థి 20 వికెట్లు తీయడం అత్యంత కీలకమని వ్యాఖ్యానించాడు. కేవలం బ్యాటింగ్ డెప్త్ కోసం బౌలింగ్‌ను బలహీనపర్చకూడదని పేర్కొన్నాడు. కుల్‌దీప్ బ్యాట్‌తో ఏమీ అసమర్థుడు కాదని, నైట్‌వాచ్‌మన్‌గా ఎన్నోసార్లు ఎక్కువ సేపు క్రీజులో నిలబడిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశాడు. జడేజా, అశ్విన్ వలె భారీ హిట్టింగ్ చేయలేకపోయినా, ఒక ప్రామాణిక స్పిన్ బౌలర్‌గా ప్రపంచంలో ఎక్కడైనా వికెట్లు తీయగల సత్తా కుల్‌దీప్‌కు ఉందని కొనియాడాడు. తుది జట్టులో తన స్థానం ఖాయమనే భరోసా కల్పించినపుడే ఆటగాళ్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తారని ఈ సందర్భంగా మురళీ కార్తిక్ చెప్పుకొచ్చాడు.

# పోర్చుగల్ టీ20 జట్టు కెప్టెన్‌గా మోసెస్ హెన్రిక్స్



క్రికెట్ ప్రపంచంలో ఆస్ట్రేలియా తరఫున సుదీర్ఘ కాలం పాటు ఆల్ రౌండర్‌గా సేవలందించిన మోసెస్ హెన్రిక్స్ తన కెరీర్‌లో అత్యంత ఆసక్తికరమైన రెండో అధ్యాయాన్ని ప్రారంభించాడు. ఇన్నాళ్లు ఆస్ట్రేలియా తరఫున క్రికెట్ ఆడిన అతడు.. ఇప్పుడు మరో దేశ జాతీయ జట్టుకు కెప్టెన్ అయ్యాడు. ఈ మేరకు పోర్చుగల్ జాతీయ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా హెన్రిక్స్‌ను నియమిస్తూ పోర్చుగల్ క్రికెట్ బోర్డు ప్రకటన విడుదల చేసింది. అతడి సారథ్యంలోనే పోర్చుగల్ జట్టు 2028 టీ20 వరల్డ్ కప్ యూరప్ సబ్-రీజినల్ క్వాలిఫయర్ 'సి'లో తలపడనుంది. ఫిన్‌లాండ్ వేదికగా ఆగస్టు 14 నుంచి 21 వరకు ఈ టోర్నీ జరగనుంది. ఫుట్‌బాల్ లెజెండ్ క్రిస్టియానో రొనాల్డో జన్మించిన పోర్చుగల్‌లోని 'మదీరా' దీవిలోనే హెన్రిక్స్ జన్మించాడు. చిన్నతనంలో కుటుంబంతో కలిసి ఆస్ట్రేలియాకు వలస వెళ్లాడు. ఆస్ట్రేలియా జాతీయ జట్టు తరఫున 4 టెస్టులు, 16 వన్డేలు, 24 టీ20 మ్యాచ్‌లు ఆడాడు మోసెస్ హెన్రిక్స్. న్యూ సౌత్ వేల్స్, బిగ్ బాష్ లీగ్‌లో సిడ్నీ సిక్సర్స్ తరఫున ఆడాడు. అంతేకాకుండా సిడ్నీ సిక్సర్స్ జట్టుకు వరుసగా 2019-20, 2020-21 సీజన్లలో కెప్టెన్‌గా టైటిళ్లు సాధించి పెట్టాడు. 2021లో బంగ్లాదేశ్‌తో ఆసీస్ తరఫున తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. మూడేళ్ల కూలింగ్-ఆఫ్ పీరియడ్ పూర్తి చేసుకుని పోర్చుగల్ తరఫున ఆడే అర్హత సాధించాడు. గత నెలలోనే ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన 39 ఏళ్ల హెన్రిక్స్, తన జన్మభూమి అయిన పోర్చుగల్‌కు ఆడాలనే నిర్ణయాన్ని వెల్లడించాడు. అయితే కేవలం ఆటగాడిగానే కాకుండా బోర్డు అతనికి ఏకంగా జట్టు నాయకత్వ పగ్గాలను అప్పగించింది. ఐసీసీ నిబంధనల ప్రకారం ఈ టోర్నీ ఫైనల్ గెలిచిన జట్టు యూరోపియన్ రీజినల్ క్వాలిఫయర్ రౌండ్‌కు చేరుకుంటుంది. అక్కడ స్కాట్లాండ్, జెర్సీ, డెన్మార్క్ వంటి బలమైన జట్లతో పోటీపడి టాప్-2లో నిలిస్తే గ్లోబల్ క్వాలిఫయర్ ద్వారా 2028లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వేదికలుగా జరగబోయే ప్రధాన టీ20 వరల్డ్ కప్‌నకు పోర్చుగల్ అర్హత సాధించవచ్చు. బిగ్‌బాష్ లీగ్, ఐపీఎల్, అంతర్జాతీయ క్రికెట్‌లో విశేష అనుభవం ఉన్న మోసెస్ హెన్రిక్స్ సారథ్యంలో అసోసియేట్ దేశమైన పోర్చుగల్ క్రికెట్ ఎలాంటి ప్రదర్శన చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# భారత్-అఫ్ఘాన్ టీ20 షెడ్యూల్ విడుదల

భారత్, అఫ్ఘానిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య మరో రసవత్తర సమరానికి రంగం సిద్ధమైంది. అఫ్ఘానిస్థాన్ హోస్ట్ చేసే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ఢిల్లీలోని ప్రతిష్టాత్మక అరుణ్ జైట్లీ క్రికెట్ స్టేడియం ఆతిథ్యమివ్వనుందని అఫ్ఘానిస్థాన్ క్రికెట్ బోర్డు, బీసీసీఐ సంయుక్తంగా వెల్లడించాయి. సెప్టెంబర్ 13న తొలి టీ20, సెప్టెంబర్ 15న రెండో టీ20, సెప్టెంబర్ 17న మూడో టీ20 మ్యాచ్‌లు ఒకే వేదికపై జరగనున్నాయి. అఫ్ఘానిస్థాన్ తమ స్వదేశీ సిరీస్‌లను భారత్, యూఏఈలలో ఆడుతున్న నేపథ్యంలో, ఈ ద్వైపాక్షిక సిరీస్‌కు భారత్‌నే హోస్ట్ వేదికగా ఎంచుకుంది. అఫ్ఘానిస్థాన్‌లో క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ ఎల్లప్పుడూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ తెలిపారు. నాణ్యమైన ప్రత్యర్థి జట్లతో ద్వైపాక్షిక మ్యాచ్‌లు ఆడటం వల్ల అఫ్ఘాన్ ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయిలో విలువైన అనుభవం లభిస్తుందని పేర్కొన్నారు. భారత అభిమానుల్లో అఫ్ఘాన్ ఆటగాళ్లకు ఉన్న ఆదరణ ఇరు దేశాల క్రికెట్ అనుబంధాన్ని మరింత బలోపేతం చేసిందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నారు. 2018లో అఫ్ఘాన్ తొలి చారిత్రక టెస్టుకు ఆతిథ్యమిచ్చిన భారత్, ఇటీవలే జూన్‌లో టెస్ట్, వన్డే సిరీస్‌లను నిర్వహించిన సంగతిని ఆయన గుర్తుచేశారు. ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రోహన్ జైట్లీ ఈ సిరీస్ పట్ల హర్షం వ్యక్తం చేశారు. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఇరు జట్లకు అత్యుత్తమ వసతులు కల్పిస్తామని, ఢిల్లీ క్రికెట్ అభిమానులకు ఈ మూడు టీ20 మ్యాచ్‌లు సరికొత్త వినోదాన్ని అందిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సిరీస్ అఫ్ఘానిస్థాన్ క్రికెట్‌కు ఎంతో కీలకమని ఏసీబీ చైర్మన్ మిర్వైస్ అష్రఫ్ పేర్కొన్నారు. బీసీసీఐతో ఉన్న దీర్ఘకాలిక సంబంధాల్లో ఇది మరో కీలక ముందడుగు అని, భారత్ వేదికగా ఈ సిరీస్ నిర్వహించడం ద్వారా వాణిజ్య, సాంకేతిక, క్రీడా రంగాల్లో తమకు ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కాగా బీసీసీఐ, ఏసీబీ ప్రకటనతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు షాక్ తగిలినట్లయింది. ఎందుకంటే ఆ దేశ క్రికెట్ బోర్డు.. తమతో సిరీస్ ఆడేందుకు భారత్.. బంగ్లాదేశ్ వస్తుందని ఆశలు పెట్టుకుంది. కానీ తాజా షెడ్యూల్ ప్రకటన చూస్తే.. బంగ్లాదేశ్ పర్యటనకు తాము వెళ్లడం లేదని బీసీసీఐ చెప్పేసినట్లయింది.




# దేశవాళీ క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి

**• భారత దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్**



దేశవాళీ క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని భారత దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్ అన్నాడు. దేశవాళీ క్రికెట్ ఆడని భారత ఆటగాళ్ల పట్ల బీసీసీఐ కఠినంగా వ్యవహరించాలని సూచించాడు. గత రెండేళ్లుగా స్పిన్ బౌలింగ్ ఎదుర్కోవడంలో టీమిండియా తడబడుతోంది. ముఖ్యంగా యువ ఆటగాళ్ల సామర్థ్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఆడలేకనే టీమిండియా సొంతగడ్డపై న్యూజిలాండ్, సౌతాఫ్రికా చేతుల్లో క్లీన్ స్వీప్ అయ్యింది. అయితే టెస్ట్‌ల్లో టీమిండియా ఘోర వైఫల్యానికి స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఆడలేకపోవడమే ప్రధాన కారణమని కపిల్ దేవ్ అన్నాడు. అగ్రశ్రేణి ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్‌కు దూరంగా ఉండటంతోనే స్పిన్ బౌలింగ్‌ను సరిగ్గా ఆడలేకపోతున్నారని అభిప్రాయపడ్డాడు. 'దేశవాళీ క్రికెట్ ఆడటం చాలా ముఖ్యం. టాప్ క్లాస్ ప్లేయర్లు తగినంతగా దేశవాళీ క్రికెట్ ఆడకపోవడం వల్లే భారత జట్లు స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడుతున్నాయి. ఈ విషయంలో బీసీసీఐ కఠినంగా వ్యవహరించి అందరూ దేశవాళీ రెడ్ బాల్ క్రికెట్ ఆడేలా చూడాలి. దాంతో టాప్ క్లాస్ ఆటగాళ్ల నుంచి ఎంతో నేర్చుకునే అవకాశం కుర్రాళ్లకు లభిస్తోంది. ఈ మధ్య భారత్ ఎక్కువగా టీ20లు, వన్డేలు ఆడుతోంది. టెస్ట్ క్రికెట్ పూర్తిగా భిన్నమైదని. ఈ సమస్యను అధిగమించడానికి ఒక పరిష్కార మార్గాన్ని కనుగొనాలి. టీ20 మ్యాచ్‌లు పెరిగినందున పేసర్లు గాయాల బారిన పడకుండా వారి వర్క్‌లోడ్‌పై బీసీసీఐ ఫోకస్ పెట్టాలి.'అని సూచించాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027లో భాగంగా రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లింది. ఆగస్ట్ 15 నుంచి ఈ సిరీస్ మొదలవ్వనుంది. గాలే వేదికగా తొలి టెస్ట్ జరగనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను టీమిండియా 2-0తో క్లీన్ స్వీప్ చేయాలి.

# ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి హార్దిక్ పాండ్యా



ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందు టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ హాట్ టాపిక్‌గా మారింది. హార్దిక్ ట్రేడింగ్ గురించి పూటకో వార్త తెరపైకి వస్తుంది. పేలవ ప్రదర్శన నేపథ్యంలో ముంబై ఇండియన్స్‌ను వీడేందుకు హార్దిక్ పాండ్యా సిద్ధమవ్వగా.. అతన్ని తీసుకునేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపిస్తున్నాయి. మరోవైపు హార్దిక్ పాండ్యాను అడ్డుపెట్టుకొని తమకు కావాల్సిన ఆటగాళ్ల కోసం ఆయా ఫ్రాంచైజీలతో ముంబై ఇండియన్స్ సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో రోజుకో ఫ్రాంచైజీలో హార్దిక్ పాండ్యా చేరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముందుగా చెన్నై సూపర్ కింగ్స్‌తో హార్దిక్ పాండ్యా ట్రేడ్ డీల్స్ జరిపిన ముంబై ఇండియన్స్ ఆ తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్, కేకేఆర్‌తో చర్చలు జరిపినట్లు ప్రచారం జరిగింది. హార్దిక్ పాండ్యా తన పాత ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించాడని, అతన్ని తీసుకునేందుకు ఆఫ్రాంచైజీ కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. కానీ హార్దిక్ పాండ్యా కెప్టెన్సీ అడగడంతో అతని ట్రేడ్ డీల్‌ను తిరస్కరించినట్లు తెలుస్తోంది. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి చేరేందుకు హార్దిక్ పాండ్యా సిద్ధమయ్యాడని సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరుగుతోంది. ఎక్స్ వేదికగా హార్దిక్ పాండ్యా ఫొటోను ఢిల్లీ క్యాపిటల్స్ షేర్ చేయడం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. గాయంతో భారత జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా.. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సీఓఈలో రిహాబిలిటేషన్ తీసుకుంటున్నాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి కష్టపడుతున్నాడు. అయితే ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల జట్టు ఆల్‌రౌండర్ మిన్ను మణి కూడా సీఓఈలోనే రిహాబిలిటేషన్ తీసుకుంటుంది.

# సూర్యకుమార్ యాదవ్‌పై కన్నేసిన ఫ్రాంచైజీలు



టీమిండియా మాజీ టీ20 కెప్టెన్, ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఆ జట్టును వీడనున్నాడనే వార్తలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. పేలవ ఫామ్‌తో టీమిండియా టీ20 కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కోల్పోయిన సూర్యను వదులుకునేందుకు ముంబై సిద్ధమైందని వార్తలు వచ్చాయి. అతన్ని లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ చేసేందుకు ముంబై ప్రయత్నించినట్లు కూడా ప్రచారం జరిగింది. సూర్య నిష్క్రమణపై ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోయినప్పటికీ.. అతను జట్టును వీడటం ఖాయమనిపిస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో సూర్యకుమార్ యాదవ్ పేలవ ప్రదర్శన ముంబై ఇండియన్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. 13 మ్యాచ్‌ల్లో సూర్య రెండు హాఫ్ సెంచరీలతో 270 పరుగులే చేశాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లో 717 పరుగులు చేసిన సూర్య ఆ జోరును కొనసాగించలేకపోయాడు. అంతేకాకుండా గత ఏడాదిన్నరగా సూర్య.. అంతర్జాతీయ క్రికెట్‌లో కూడా విఫలమయ్యాడు. పేలవ ప్రదర్శనతో చివరకు కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కూడా కోల్పోయాడు. ఈ క్రమంలోనే అతన్ని వదులుకునేందుకు ముంబై ఇండియన్స్ సిద్ధమైందనే వాదన వినిపిస్తోంది. అయితే సూర్యను ముంబై వదిలేస్తే అతన్ని తీసుకునేందుకు మూడు ఫ్రాంచైజీలు రెడీగా ఉన్నాయి. సూర్యకుమార్ యాదవ్‌ను తీసుకునే ఫ్రాంచైజీల్లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ముందు వరుసలో ఉంది. ప్రస్తుతం సూర్య ఫామ్‌లో లేకపోయినా అతని అనుభవం, టీ20 ఫార్మాట్‌కు సరిగ్గా సరిపోయే బ్యాటింగ్ శైలి జట్టుకు ఉపయోగపడుతుందని కేకేఆర్ భావిస్తోంది. అంతేకాకుండా కేకేఆర్‌కు కెప్టెన్ అవసరం ఉంది. సూర్యను తీసుకుంటే కెప్టెన్సీతో పాటు మిడిలార్డర్ బ్యాటర్ లోటును తీర్చుకోవచ్చని భావిస్తోంది. అవసరమైతే సూర్య కోసం ముంబైతో కేకేఆర్ ట్రేడ్ డీల్స్ జరపనుంది. వేలంలోకి వచ్చినా కోట్ల రూపయాలను కుమ్మరించనుంది. సూర్యకుమార్ యాదవ్ కోసం లక్నో సూపర్ జెయింట్స్ కూడా పోటీపడనుంది. అయితే అతని కోసం తమ స్టార్ ఆటగాళ్లను వదులుకునేందుకు లక్నో సిద్ధంగా లేదు. ఈ క్రమంలోనే ముంబైతో ట్రేడ్ డీల్‌కు నిరాకరించినట్లు తెలుస్తోంది. ఒకవేళ సూర్య వేలంలోకి వస్తే అతన్ని కొనుగోలు చేసే ప్రయత్నం చేయనుంది. ఎందుకంటే లక్నోకు కూడా కెప్టెన్సీతో పాటు ఓ ఇండియన్ మిడిలార్డర్ బ్యాటర్ అవసరం ఉంది. సూర్య కోసం రాజస్థాన్ రాయల్స్ కూడా పోటీ పడనుంది. అవసరమైతే ముంబై ఇండియన్స్‌తో ట్రేడ్ డీల్‌కు ప్రయత్నాలు కూడా చేయవచ్చు. సూర్య కోసం యశస్వి జైస్వాల్‌ను కూడా వదులుకునేందుకు రాజస్థాన్ రాయల్స్ సిద్ధంగా ఉంది. టాప్ క్లాస్ ఇండియన్ మిడిలార్డర్ బ్యాటర్ అవసరం ఆ జట్టుకు ఉంది. అంతకంటే అనుభవం కలిగిన సారథి ఆ జట్టుకు కావాలి. సూర్య రాకతో ఈ రెండు సమస్యలను అధిగమించవచ్చని రాజస్థాన్ రాయల్స్ భావిస్తోంది.



# ఇక సినిమాల్లో అవకాశాలు రావనుకున్నా

## నటి సమంత


నటి సమంత 'మా ఇంటి బంగారం'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. యాక్షన్ సినిమాల్లో నటించడం అంత సులభమైన విషయం కాదన్నారు. సొంతంగా సినిమాలు నిర్మించడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిర్మాణ రంగం తనకిచ్చిన సృజనాత్మక స్వేచ్ఛ.. నటన ఇవ్వలేదని తెలిపారు. మయోసైటిస్ వచ్చిందని తెలిసినప్పుడు ఓ ఆలోచన నన్ను కలవరపెట్టింది. ఇక సినిమాలోకి తీసుకోవడానికి నిర్మాతలు ఆలోచిస్తారేమోనని భయపడ్డాను. కానీ, ఇప్పుడు నేనే నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి సినిమాలు నిర్మిస్తున్నాను. వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాను. చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే కెమెరా ముందు కాకుండా వెనక కూడా నాకు నచ్చిన పనులు చేస్తున్నాను' అని అన్నారు. యాక్షన్ పాత్రల గురించి సమంత మాట్లాడుతూ, 'ది ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్: హనీ బన్నీ సిరీస్‌లలో నేను చేసిన యాక్షన్ సీన్లకు మంచి స్పందన రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అమ్మాయిలు యాక్షన్ సన్నివేశాలు చేస్తే ప్రేక్షకులు అంత సులభంగా అంగీకరించరు. ఆ ధోరణిని తీసివేయాలనుకుంటున్నా. హీరోయిన్స్ కూడా అన్ని చేయగలరని నిరూపించాలని అనుకుంటున్నా. సినిమాలో దెబ్బలు తింటూ, ఫైట్స్ చేయడం నాకెంతో ఉత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు.

# అసభ్యకరమైన పోస్టులు తొలగించండి

## జాన్వీ కపూర్ పిటిషన్‌పై కోర్టు ఆదేశం

ప్రముఖ బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పేరు, ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకుని సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు, ఎఐ ద్వారా సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలను ప్రచారం చేస్తున్నారని ఆమె తరపు న్యాయవాది కోర్టులో వాదించారు. అయితే ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూప్ జైరామ్ భంభాని కీలక ఆదేశాలు జారీ చేశారు. అసభ్యకరంగా ఉన్న కంటెంట్‌ను, అలాగే ఎవరైనా ఆమె పేరును వాణిజ్యపరంగా దుర్వినియోగం చేస్తుంటే ఆ పోస్టులను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. పర్సనాలిటీ రైట్స్ అనే భావనకు ఒక సరైన హద్దు ఉండాలని, సెలబ్రిటీల హక్కులను రక్షించడంతోపాటు భావప్రకటన స్వేచ్ఛను కూడా సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అన్ని ఫ్యాన్ పేజీలపై ఒకేసారి నిషేధం విధించలేమని కోర్టు పేర్కొంది. కేవలం వాణిజ్య ప్రయోజనాల కోసం లేదా డబ్బు సంపాదనే లక్ష్యంగా ఎవరైనా ఆమె పేరును వాడుకుంటేనే కచ్చితంగా చర్యలు తీసుకోవచ్చునని, అయితే అన్ని ఫ్యాన్ పేజీలను నేరపూరితమైనవిగా పరిగణించలేమని తెలిపారు. కొందరు వ్యంగ్యంగా లేదా విమర్శనాత్మక ధోరణిలో కూడా పోస్టులు చేసే అవకాశం ఉందని న్యాయమూర్తి గుర్తుచేశారు. ఈ కేసులో మెటా తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ తరపున ఇప్పటికే 4,000కు పైగా యూఆర్‌ఎల్‌లను సమర్పించారని, అయితే ఆ కంటెంట్ అంతా ఒకేలా అభ్యంతరకరంగా లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో, ఆరోపణలు ఎదుర్కొంటున్న కంటెంట్‌ను స్పష్టమైన వర్గాలుగా విభజించి తదుపరి విచారణకు కోర్టు ముందుంచాలని పిటిషనర్ తరపు న్యాయవాదిని న్యాయమూర్తి ఆదేశించారు. గతంలో కూడా పలువురు ప్రముఖ నటీనటులు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు తమ వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.



# కిమ్స్ ఆసుపత్రిలో ఎన్టీఆర్‌కు విజయవంతంగా సర్జరీ పూర్తి

టాలీవుడ్ అగ్రహీరో జూనియర్ ఎన్టీఆర్‌కు బుధవారం నాడు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగింది. ఆయన భుజానికి వైద్యులు విజయవంతంగా ఆర్థ్రోస్కోపిక్ సర్జరీని నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రస్తుతం ఆయన ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు హెల్త్ బులెటిన్ ద్వారా వెల్లడించాయి. ఇటీవల జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న సమయంలో ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. ఆ సమయంలో వైద్యులు ఆయనకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అయితే, గాయం నుంచి వేగంగా, పూర్తిగా కోలుకోవాలంటే శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సిఫార్సు చేయడంతో నేడు ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఈ శస్త్రచికిత్స నుంచి ఎన్టీఆర్ పూర్తిగా కోలుకుని, తిరిగి తన వృత్తిపరమైన పనుల్లో నిమగ్నం కావడానికి సుమారు రెండు నుంచి మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉందని వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్నారు.





# మరోసారి 'చిరు లీక్స్'...

## తన 158వ సినిమా టైటిల్ చెప్పేసిన మెగాస్టార్!




మెగాస్టార్ చిరంజీవి తన రాబోయే సినిమాకు సంబంధించిన కీలకమైన విషయాన్ని అనుకోకుండా బయటపెట్టారు. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' సక్సెస్ మీట్‌లో తన 158వ సినిమా టైటిల్‌ను ఆయనే స్వయంగా లీక్ చేశారు. దీంతో చజష్ట్రఅతీబూమ్ఖునం అనే హ్యాష్‌ట్యాగ్ సోషల్ మీడియాలో మరోసారి వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే.. కేఎస్ రవీంద్ర (బాబీ కొల్లి) దర్శకత్వంలో చిరంజీవి తన 158వ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి 'కదిరి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ విషయాన్ని చిరంజీవి సరదాగా వేదికపై వెల్లడించారు. ఈవెంట్‌లో లీక్‌ల గురించి ప్రస్తావన రాగా, సంగీత దర్శకుడు తమన్ వద్దని వారిస్తున్నా, "టీజర్ మ్యూజిక్ అయ్యిందా? చివర్లో 'కదిరి' అని టైటిల్ పెట్టారా?" అని చిరంజీవి అడగడంతో అసలు విషయం బయటపడింది. అంతేకాదు తన పుట్టినరోజు కానుకగా ఆగస్టు 22న ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయనున్నట్లు కూడా ప్రకటించారు. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి-బాబీ కలయికలో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలున్నాయి. ఈ చిత్రంలో చిరంజీవి సరసన ప్రియమణి కథానాయికగా నటిస్తుండగా, కన్నడ నటి రచితా రామ్, నివేదా పేతురాజ్, అనశ్వర రాజన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కే నారాయణ, లోకేశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు.

# ఇరుముడి ట్రైలర్ రిలీజ్..

మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్నారు.. చివరిగా ఆయన నటించిన మాస్ జాతర, భర్త మహాశయులకు విజ్ఞప్తి ఈ రెండు చిత్రాలు కూడా ఆయనకు పెద్దగా విజయాన్ని అందించలేదు. దీంతో ఆయన ఖాతాలో హిట్ అనివార్యమైంది. ఈ నేపథ్యంలోనే ఎలాగైనా మంచి సక్సెస్ అందుకోవాలని చూస్తున్న రవితేజ ఏకంగా జానర్ మార్చి 'ఇరుముడి' అనే టైటిల్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆగస్టు 21న ఈ సినిమా విడుదల కాబోతోంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో చిత్ర బృందం అప్పుడే ప్రమోషనల్ కార్యక్రమాలు మొదలుపెట్టింది. పైగా సినిమా నుండి ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి రెస్పాండ్ లభించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ సినిమా ట్రైలర్ ను విడుదల చేశారు. అయ్యప్ప మాలలో ప్రేక్షకులకు ఈసారి మంచి వినోదాన్ని పంచడానికి సిద్ధమైన రవితేజ.. ఈ ట్రైలర్ తో సినిమాపై అంచనాలు పెంచేశారు. తాజాగా విడుదల చేసిన ట్రైలర్లో భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ మేళవింపుగా దీనిని తీర్చిదిద్దినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది.




# 4న వస్తోన్న క్రైమ్ థ్రిల్లర్ మీర్జాపూర్ మూవీ




భారతీయ ఓటీటీ చరిత్రలో సంచలనం సృష్టించడంతో పాటు అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించేందుకు సిద్ధమైంది. అమెజాన్ ఎమ్‌జీఎం స్టూడియోస్ మరియు ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై రితేష్ సిధ్వాని, ఫర్హాన్ అక్తర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి గుర్‌మీత్ సింగ్ దర్శకత్వం వహిస్తుండగా, సిరీస్‌లో అదరగొట్టిన ప్రధాన నటీనటులందరూ మళ్లీ పెద్ద తెరపై తమ విశ్వరూపం చూపించడానికి వస్తున్నారు. 'సింహాసనం అనేది రాజకీయాల ద్వారా రాదు, అలా అని వంశపారంపర్యంగానూ రాదు? కేవలం బాహుబలం ఉంటేనే సింహాసనం దక్కుతుంది అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో ట్రైలర్ ఆకట్టుకుంటుంది. ఓటీటీలో వెబ్ సిరీస్‌గా ప్రేక్షకులను అలరించిన ఈ నేర ప్రపంచాన్ని, మరింత భారీ హంగులతో, అత్యున్నత నిర్మాణ విలువలతో వెండితెర కోసం మలిచారు. గతంలో సిరీస్‌లో మరణించినట్లు చూపించిన మున్నా భయ్యా (దివ్యేందు) పాత్ర ఈ చిత్రంలో మళ్లీ రీఎంట్రీ ఇస్తుండటం అభిమానులకు అసలైన విందుగా మారనుంది. ఇక మిర్జాపూర్ సింహాసనం కోసం జరిగే పోరులో కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డూ పండిట్ (అలీ ఫజల్) మరియు మున్నా భయ్యా మధ్య జరిగే రక్తపాతంతో కూడిన పోరాటం ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, దివ్యేందులతో పాటు శ్వేతా త్రిపాఠి, రసికా దుగ్గల్, అభిషేక్ బెనర్జీ, జితేంద్ర కుమార్, రవి కిషన్ మరియు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# గతంలో జరిగిన తప్పులకు క్షమించండి

## డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్‌లో జానీమాస్టర్

తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్, డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార వేడుకలో ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ చేసిన వ్యాఖ్యలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో ఫిల్మ్ ఛాంబర్, ఫెడరేషన్‌తో తలెత్తిన విభేదాలు మరియు వివాదాల పట్ల జానీ మాస్టర్ బహిరంగంగా క్షమాపణలు కోరారు. గత కాలపు పొరపాట్లను పక్కనపెట్టి మళ్లీ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించుకున్నామని, కొంతకాలం అసోసియేషన్‌కు దూరంగా ఉన్నప్పటికీ మళ్లీ అందరితో కలిసి పనిచేసేందుకు వచ్చానని ఆయన స్పష్టం చేశారు. ఇకపై అందరం ఒకే కుటుంబంలా కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నిర్మాతలు ఇచ్చే పారితోషికాలు డ్యాన్సర్లకు పూర్తిగా అందడం లేదనే తీవ్ర ఆవేదనతోనే గతంలో తాను మాట్లాడాల్సి వచ్చిందని ఆయన వెల్లడించారు. ఇదే అంశంపై మెగాస్టార్ చిరంజీవిని కలిసినప్పుడు, ఆయన ఎంతో సానుకూలంగా స్పందించి సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో తన మాటల ద్వారా ఎవరికైనా మనస్తాపం కలిగి ఉంటే, లేదా తెలిసీ తెలియక ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే పెద్ద మనసుతో క్షమించాలని ఇండస్ట్రీ పెద్దలను జానీ మాస్టర్ కోరారు. తండ్రి కోప్పడినా చివరికి పిల్లలను దగ్గరకు తీసుకున్నట్లే, సినీ పరిశ్రమ పెద్దలు మరియు నిర్మాతల మండలి డ్యాన్సర్ల అసోసియేషన్‌ను కలుపుకొని ఆదరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613